E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 18-01-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక: 18|| పేజీలు–6 www.ekaburu.com



ట్రంప్ ఓ నేరస్థుడు » 2లో

## మున్సిపల్ రిజర్వేషన్ ఖరారు



- మేయర్, చైర్మన్లతో పాటు వార్డుల రిజర్వేషన్ల ప్రకటన
- రిజర్వేషన్లకు అనుగుణంగానే ఎన్నికలు నిర్వహణ
- రిజర్వేషన్లపై ఆశలు పెట్టుకున్న వారికి నిరాశ
- పోటీకి సిద్ధమవుతున్న పార్టీల నేతలు

ఈ కబురు, ఉమ్మడి జిల్లా పరిధిలో మున్సిపల్ రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఒక నగర కార్పొరేషన్ తో పాటు 12 మున్సిపాలిటీలకు మేయర్, చైర్మన్ల రిజర్వేషన్లు ప్రకటించారు. మున్సిపాలిటీలలో వార్డుల వారిగా రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఎన్నికల షెడ్యూల్ రానుండటంతో ముందుగానే రిజర్వేషన్లను ప్రకటించారు. ఈ రిజర్వేషన్లకు అనుగుణంగానే ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో మేయర్, చైర్మన్ రిజర్వేషన్లు అధికారులు ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్, మహిళా రిజర్వేషన్లను ప్రకటించారు. రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ అధికారులు ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వరంగల్ కార్పొరేషన్, 12 మున్సిపాలిటీ ల రిజర్వేషన్లు ప్రకటించారు.

తరువాయి 2లో

# విదేశాల్లాగ మనకూ అధునాతన రైళ్లు

### ఆధునిక భారత్‌లో ఇదో మైలురాయి
### వందేభారత్ స్లీపర్ రైళ్ల ప్రారంభోత్సవంలో మోదీ



ఈ కబురు, గువాహటి: అభివృద్ధి చెందిన దేశాలను గమనిస్తూ మనకూ అలాంటివి వస్తాయా అని ఒకప్పుడు అనుకునేవాళ్లమని, ఇప్పుడు ఆ కలలన్నీ సాకారం అవుతున్నాయని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటిదిగా హావ్‌డాగువాహటి మధ్య నడిచే వందేభారత్ స్లీపర్(ఏసీ) రైలును శనివారం మాల్డా టౌన్ రైల్వే స్టేషన్లో ఆయన ప్రారంభించారు. దీంతోపాటు న్యూజల్పాయ్‌గుడి నుంచి నాగర్‌కోయిల్, తిరుచిరాపల్లిలకు; అలీపుర్‌ద్వార్ నుంచి బెంగళూరు, ముంబయి (పన్వెల్)లకు వెళ్లే నాలుగు అధునాతన 'అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్' రైళ్లకు వర్చువల్‌గా చూపించారు. గువాహటి నుంచి హావ్‌డాకు వచ్చే వందేభారత్ స్లీపర్ రైలుకు కూడా ఆయన వర్చువల్‌గా జెండా ఊపారు. పశ్చిమబెంగాల్‌లో రూ.3,250 కోట్ల వ్యయమయ్యే వివిధ రోడ్డు, రైలు ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..'బెంగాల్లో చేపట్టిన ప్రాజెక్టులు, ముఖ్యంగా నూతన రైళ్లు ఈ ప్రాంత యువతకు సాధికారత కల్పిస్తాయి. రవాణా సదుపాయాలను ఆధునికీకరించడంతోపాటు దేశం స్వయంసమృద్ధి సాధించేలా చేస్తున్నాం. ఇప్పుడు అమెరికా, ఐరోపా కంటే మన దేశంలోనే ఎక్కువ రైలింజిన్లు, బోగీలు తయారవుతున్నాయి. ఆధునిక భారతంలో ఓ మైలురాయిలా నిలిచేలా వందేభారత్ స్లీపర్ రైళ్ల ప్రస్థానం మొదలైంది. సమీప భవిష్యత్తులో దేశవ్యాప్తంగా వందేభారత్ స్లీపర్ రైళ్లు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే నడుస్తున్న 150 వందేభారత్ రైళ్లతో మన రైల్వేవ్యవస్థ ఆధునిక సొబగులు సంతరించుకుని వేగంగా పరుగులు తీస్తోంది' అని మోదీ పేర్కొన్నారు

తరువాయి 2లో

## జిల్లాల రద్దుకు సీఎం కుట్ర

» 3లో



## ఇందౌర్ మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత: రాహుల్

» 2లో



# పదేళ్లలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేశారా?

- అసెంబ్లీలో చర్చకు రమ్మంటే పారిపోయి మమ్మల్ని ప్రశ్నిస్తారా?
- మహబూబ్‌నగర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు నన్ను దిగిపో దిగిపో అంటున్నారు..
- సీఎం కుర్చీ ఏమైనా మీ జాగీరా? మీ తాతలు ఇచ్చిన ఆస్తినా?
- ఇంకా పదేళ్లు మేమే ఉంటాం
- రూ. 1,284 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం



**ఈ కబురు, మహబూబ్‌నగర్:** 'ప్రజా సమస్యలు, ప్రాజెక్టులపై శాసనసభ వేదికగా చర్చించాలని సవాల్ విసిరా. రోజంతా చర్చ పెట్టినా ప్రతిపక్ష నాయకుడు రాకుండా పారిపోయారు. నిజంగా వారు తెలంగాణకు ప్రాజెక్టులు తెచ్చి ఉంటే.. సాగు నీరందించి సస్యశ్యామలం చేస్తే ఎందుకు పారిపోయారు? చర్చకు రాకుండా పారిపోయి మళ్లీ మమ్మల్ని ప్రశ్నిస్తారా? మీరు పదేళ్లలో ఒక్క ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా?'


తరువాయి 2లో

## ఎదురుకాల్పుల్లో...నలుగురు మావోయిస్టులు మృతి



ఈ కబురుఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా, ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మహిళతో సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందారు

» 3లో



## చరిత్ర గురించి నేటితరం తెలుసుకోవాలి

### జైపుర్ సాహిత్య వేడుకల్లో సుధామూర్తి

ఈ కబురు, జైపుర్: ఈ భూమి, మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఊరికే రాలేదన్న విషయాన్ని నేటి తరం చిన్నారులు కచ్చితంగా తెలుసుకోవాలని రాజ్యసభ ఎంపీ, రచయిత్రి సుధామూర్తి అభిప్రాయపడ్డారు

» 3లో

# పేదలకు అండ.. శత వసంతాల ఎర్రజెండా!

- కాలపరీక్షకు తట్టుకొని నిలిచిన సీపీఐ
- తెలంగాణ సాయుధ పోరాటం, విద్యుత్ ఉద్యమాల్లో కీలక పాత్ర
- నేడు ఖమ్మంలో సీపీఐ శత వసంతాల ముగింపు సభ
- హాజరుకానున్న జాతీయస్థాయి నేతలు, సీఎం రేవంత్‌రెడ్డి



ఈ కబురు, ఖమ్మం: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వసంతాల ముగింపు ఉత్సవాలకు కమ్యూనిస్టుల ఎర్రకోట ఖమ్మం ముస్తాబైంది. కాలపరీక్షకు తట్టుకొని రెపరెపలాడుతున్న ఎర్రజెండా నూరేళ్ల పండక్కి కమ్యూనిస్టు శ్రేణులు కదంతొక్కుతున్నాయి. ఆదివారం నుంచి ఈనెల 21 వరకు సీపీఐ వందేళ్ల ఉత్సవాలను ఖమ్మంలో నిర్వహించేందుకు పార్టీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఖమ్మంలో నిర్వహిస్తున్న ర్యాలీ, భారీ బహిరంగసభ ద్వారా ఎర్రజెండాకు పూర్వ వైభవం తీసుకురావాలని సీపీఐ నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. బహిరంగ సభకు ఆ పార్టీ జాతీయస్థాయి నేతలతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. ఈనెల 19 నుంచి 21 వరకు జరిగే సీపీఐ జాతీయ సమితి సమావేశాలు, ఇతర కార్యక్రమాల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీల ప్రధాన కార్యదర్శులు డి.రాజా, ఎంఏ బేబీ సహా 40 దేశాలకు చెందిన వామపక్ష పార్టీల నేతలు పాల్గొనబోతున్నారు.

**భారత గడ్డపై ప్రస్థానం**

ఎంఎన్ రాయ్, అబానీ ముఖర్జీ వంటి నేతలు 1920లోనే తాష్కెంట్‌లోనే కమ్యూనిజానికి పునాదులు వేయగా, భారత గడ్డపై సత్యభక్త నేతృత్వంలో 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో పార్టీ రూపుదిద్దుకుంది. 'సంపూర్ణ స్వరాజ్' కావాలని కాంగ్రెస్ కంటే ముందే డిమాండ్ చేసిన ఘనత కమ్యూనిస్టులదే. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సీపీఐ రాజకీయంగా బలమైన పార్టీగా ఎదిగింది. ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగింది. 1957లో కేరళలో ఈఎంఎస్.నంబూద్రిపాద్ నేతృత్వంలో ప్రపంచంలోనే తొలిసారిగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. ఇది భూ సంస్కరణలు, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. 1964లో పార్టీ సీపీఐ, సీపీఎంగా చీలిన తరువాత నుంచి ఎర్రజెండా బలహీనపడటం మొదలైంది. రాజకీయ ప్రాధాన్యతలో క్రమక్రమంగా పార్టీ క్షీణిస్తూ వచ్చినప్పటికీ, పోరాటాల్లో ఆ పార్టీ ముద్ర ఇప్పటికీ బలంగా కనిపిస్తుంది.

తరువాయి 2లో

# 'గద్దె'నెక్కిన అభివృద్ధి

- శిలలపై సమ్మక్క సారలమ్మల ఘన చరిత్ర
- కళ్ల తిప్పుకోనివ్వని ఆదివాసీ శిల్పకళ
- సిద్ధమైన గద్దెల ప్రాంగణం.. రేపే ప్రారంభ ఉత్సవం
- మూడోదశ ఆఖరులో సాంకేతిక లోపం



ఈ కబురు, : అమ్మా... అని పిలిస్తే అక్కడ అడవంతా పలుకుతుంది... రూపం లేదు. గుడి గోపురమంటూ ఏమీ లేదు... కారడవుల్లోని గద్దెలే భక్తుల కొంగు బంగారాలు... దాదాపు వెయ్యేళ్ల వీర గాథ.. జాతి వారసత్వ సంపద... ఆ చరిత్రకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక హంగులు అద్దింది... రాతి ప్రాకారాలు.. శిలాతోరణాలతో తీర్చిదిద్దింది... కోయ తెగల ఆచార వ్యవహారాలకు అద్దం పడుతూ... వనదేవతల ప్రాశస్త్యం ఇనుమడింపజేస్తూ... తెల్లరాతి స్తంభాలతో మేడారం సిద్ధమైంది.

వన దేవతల జాతరకు... మేడారం గతంలో కనీవినీ ఎరగని రీతిలో ముస్తాబవుతోంది. వెయ్యేళ్ల చరిత్రను తెలిపే ఘట్టాలను ఆవిష్కరించే చిత్రాలు, మూలవాసులైన కోయ తెగల ఆచార వ్యవహారాలను కళ్లకు కట్టబోతోంది. దశాబ్దాలుగా భక్తులు పడుతున్న ఇబ్బందులన్నీ తీరేలా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దింది. గద్దెల ప్రాంగణాన్ని ఆసాంతం అద్భుతంగా మార్చేసింది. ఇకపై... సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజుల గద్దెలను ఏకకాలంలో ఎనిమిది వేల మంది రెండువైపుల నుంచి దర్శించుకునే భాగ్యం కలగనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కల పట్టుదల, నిరంతర శ్రమతో కేవలం మూడు నెలల్లోనే ప్రాంగణం పునరుద్ధరణ పూర్తయింది. సోమవారం సీఎం చేతుల మీదుగా ప్రారంభం కానుంది.

తరువాయి 3లో

# విదేశాల్లాగ మనకూ అధునాతన రైళ్లు

త్వరలో పశ్చిమబెంగాల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తృణమూల్ సర్కారుపై మోదీ పలు విమర్శలు చేశారు. చొరబాటు దారులే బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ అని, అంతమాత్రాన మతువా వంటి శరణార్థులు కలవరపడాల్సిన అవసరం లేదని చెప్పారు. మమతాబెనర్జీ ప్రభుత్వ అండతో అక్రమంగా పెద్దఎత్తున వలసలు వస్తున్నవారితో రాష్ట్ర జనాభా స్వరూపమే మారిపోతూ అల్లర్లకు ఆజ్యం పోస్తోందన్నారు. బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. తాము బెంగాల్లో అధికారంలోకి వస్తే కఠిన చర్యలతో అక్రమ వలసదారుల్ని ఏరివేస్తామన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమాను అమలుచేయని ఏకైక రాష్ట్రం బెంగాలేనని చెప్పారు. వందేభారత్ స్లీపర్ రైల్లో ప్రయాణించే విద్యార్థులతో మోదీ ముచ్చటించారు. కాగా మోదీని రాజకీయ పర్యాటకుడిగా పేర్కొంటూ ఆయన తమపై చేసిన ఆరోపణల్ని తృణమూల్ ఖండించింది. 2021 ఎన్నికల్లో భాజపా ఓటమి తర్వాత తమ రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

**--అస్సాంను అగౌరవపరిచిన కాంగ్రెస్**

బెంగాల్ నుంచి శనివారం సాయంత్రం ఆయన అస్సాంకు చేరుకున్నారు. గువాహటిలో 10 వేల మంది కళాకారులు ప్రదర్శించిన బోడో జానపద నృత్యం 'బాగురుంబా'ను తిలకించి ప్రసంగించారు. అస్సాం సంస్కృతి, సంప్రదాయాలను కాంగ్రెస్ అగౌరవపరిచిందని ఆరోపించారు. చొరబాటుదారులను ఎర్రతివాచీతో స్వాగతించిన పార్టీ కూడా అదేనని చెప్పారు. మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన పాపాలను భాజపా సర్కారు ప్రక్షాళన చేస్తోందని మోదీ చెప్పారు. కిక్కిరిసిన జన సందోహం మధ్య గువాహటిలో ఆయన 4 కి.మీ. పొడవున రోడ్డుషోలో పాల్గొన్నారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం మరికొన్ని కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. అనంతరం మళ్లీ బెంగాల్‌కు వెళ్తారు.





# మున్సిపల్ రిజర్వేషన్




మొదటి పేజీ తరువాయి

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ను జనరల్ కింద రిజర్వు చేశారు. తొర్రూర్, వర్ధన్నపేట, పరకాల మున్సిపాలిటీలను జనరల్ గా ప్రకటించగా మరిపెడ మున్సిపాలిటీని జనరల్ మహిళగా డిక్లర్ చేశారు.

నగామ, భూపాలపల్లి మున్సిపాలిటీలను బీసీ జనరల్ కింద డిక్లర్ చేయగా ములుగు, నర్సంపేట మున్సిపాలిటీలను బీసీ మహిళకు కేటాయించారు. మహబూబాబాద్ మున్సిపాలిటీని ఎస్టీ జనరల్ గా రిజర్వు చేయగా కేసముద్రం మున్సిపాలిటీని ఎస్టీ మహిళకు కేటాయించారు. స్టేషన్ ఘన్పూర్, డోర్నకల్ మున్సిపాలిటీలను ఎస్సీ జనరల్ కు రిజర్వు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వరంగల్ కార్పొరేషన్ తో కలిపి ఐదు మున్సిపాలిటీలను జనరల్ కేటాయించగా నాలుగు మున్సిపాలిటీలను బీసీకి, రెండు మున్సిపాలిటీలను ఎస్టీకి, రెండు మున్సిపాలిటీలను ఎస్సీ కి రిజర్వు చేశారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పదవీకాలం ఇంకా ఐదు నెలల పాటు ఉంది. అయినా ముందుగానే రిజర్వేషన్లను ఖరారు చేశారు. మిగతా 12 మున్సిపాలిటీల్లో ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. చైర్మన్ల రిజర్వేషన్లను రాష్ట్ర స్థాయిలో చేయగా వార్డుల రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఖరారు చేశారు. ఉమ్మడి జిల్లాలో 12 మున్సిపాలిటీలకు సంబంధించిన వార్డుల రిజర్వేషన్ల ను ప్రకటించారు.

సిద్ధమవుతున్న పార్టీల నేతలు

మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు కావడంతో పార్టీల నేతలకు క్లారిటీ వచ్చింది. వార్డులతో పాటు చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ప్రకటించడంతో పార్టీల నేతలు పోటీకి సిద్ధమవుతున్నారు. కొంతమంది రిజర్వేషన్లపై ఆశలు పెట్టుకోగా వారికి అనుకున్న వార్డులు కాక వేరే వార్డులలో పోటీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు మున్సిపాలిటీ ల్లో చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్న వారికి నిరాశ మిగలగా కొత్త వారికి రిజర్వేషన్ ఆధారంగా ఆశలు పెరిగాయి. మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరుగనుండటంతో అభ్యర్థులు కూడా పెద్ద ఎత్తున పోటీ పడుతున్నారు. తమకు అనుకూలం ఉన్న స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మినీ అసెంబ్లీ ఎన్నికలుగా భావించే మున్సిపల్ పోరుకు మాత్రం అన్ని పార్టీల నేతలు సిద్ధమవుతున్నారు. తమ ప్రాధాన్యత ఉండే విధంగా పోటీ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మొత్తంగా రిజర్వేషన్లు ఖరారు కావడంతో పార్టీలలో మున్సిపల్ పోరుపై నేతల్లో ఆసక్తి పెరిగింది.

# ఇండోర్ మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత: రాహుల్



*ఈ కబురు, ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన కలుషిత నీటి మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భాగీరథ్‌పుర ప్రాంతంలో కలుషిత జలాలు తాగి ఆస్పత్రి పాలైన బాధితులను రాహుల్ పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడం, కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 'చాలా నగరాల్లో ఇదే జరుగుతోంది. స్వచ్ఛమైన నీటిని అందించడం, కాలుష్యాన్ని నియంత్రించడమనేది ప్రభుత్వ బాధ్యత. వీటిని ప్రభుత్వం నెరవేర్చడం లేదు. ఇక్కడ ప్రభుత్వానికి బాధ్యత ఉంటే దానిని వారు నిర్వర్తించాలి. వీళ్లు(బాధితులు) అదే కోరుకుంటున్నారు. వారికి మద్దతు ఇవ్వడానికే వచ్చాను. ఇందులో ఎలాంటి రాజకీయం లేదు. కావాలంటే దీన్ని రాజకీయమని పిలవండి. నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. నేను వీరికి మద్దతు ఇవ్వడానికి వచ్చాను. వీరికి స్వచ్ఛమైన మంచినీటిని అందించాలి" అని రాహుల్ డిమాండ్ చేశారు.*

# పేదలకు అండ.. శత వసంతాల ఎర్రజెండా!

మొదటి పేజీ తరువాయి




తెలంగాణ సాయుధ పోరాటం

తెలుగు నేలపై కమ్యూనిస్టుల చరిత్ర అంటే అది రక్తం చిందించిన పోరాటాల చరిత్ర. నిజాం నవాబు ఆగడాలకు, దొరల గడీల అరాచకత్వానికి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటం (1946-1951) కమ్యూనిస్టుల అతిపెద్ద విజయం. పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వర రావు, రావి నారాయణరెడ్డి వంటి ఉద్దండులు ఈ పోరాటాన్ని ముందుండి నడిపారు. 1946 జూలై 4న కడివెండిలో దొడ్డి కొమరయ్య అమరత్వం ఈ పోరాటానికి నిప్పుకణిక అయింది. చాకలి ఐలమ్మ భూమిని కాపాడటానికి 'సంఘం' (కమ్యూనిస్టులు) అండగా నిలిచింది. 3000 గ్రామాలను విముక్తం చేయడం, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచడం ప్రపంచ చరిత్రలోనే ఒక అరుదైన ఘట్టం. దేశ చరిత్రలోనే అతిపెద్ద రైతాంగ పోరాటంగా నిలిచింది. దీనికి నాయకత్వం వహించింది కమ్యూనిస్టు పార్టీయే.

ఉమ్మడి ఏపీలో, తెలంగాణలో ప్రస్థానం

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులోనూ, విశాలాంధ్ర ఉద్యమంలోనూ కమ్యూనిస్టులు అగ్రభాగాన నిలిచారు. 1952 ఎన్నికల్లో రాష్ట్రంలో కమ్యూనిస్టులు భారీ విజయాన్ని సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థాయికి వెళ్లారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో ఏళ్లపాటు సీపీఐ బలమైన ప్రతిపక్షంగా పనిచేసింది. చంద్ర రాజేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, సురవరం సుధాకరరెడ్డి వంటి దిగ్గజ నాయకులు ఇక్కడి నుంచే జాతీయ స్థాయికి ఎదిగారు. సీహెచ్ రాజేశ్వర్ రావు, దేశిని చినమల్లయ్య, చాడా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు వంటి నాయకులు రాష్ట్రంలో సీపీఐ ఎదుగుదలలో తమ వంతు పాత్ర పోషించారు. ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో సీపీఐ బలమైన రాజకీయశక్తిగా కొనసాగింది. పొత్తు రాజకీయాల్లో పార్టీ కుంచించుకుపోయినా, రాజకీయంగా పల్లెలు, పట్టణాల్లో ఎర్రజెండా ఉనికి ఇప్పటికీ చాటుతోంది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కూడా సీపీఐ తనదైన ముద్ర వేసింది. ఉమ్మడి రాష్ట్రంలో 2003లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో కూడా సీపీఐ కీలక పాత్ర పోషించింది.

లౌకికవాదాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా..


వందేళ్ల వేళ ఖమ్మం నగరం ఎర్రకోటను తలపిస్తోంది. దేశంలో మితవాద శక్తులు బలపడుతున్న తరుణంలో, లౌకికవాదాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ఈ సభ జరుగుతోంది. ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభంపై గళమెత్తడం. రాబోయే రోజుల్లో వామపక్ష ఐక్యతను చాటడమే ఈ సభ ముఖ్య ఉద్దేశం.

--కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

పుదుచ్చేరి నుంచి సైకిల్‌పై..

ఖమ్మంమయూరి సెంటర్: సీపీఐ వందేళ్ల సభలో పాల్గొనేందుకు తమిళనాడుకు చెందిన పార్టీ నాయకులు సైకిల్ యాత్రగా ఖమ్మం చేరుకున్నారు. తమిళనాడు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేవసహాయం, కార్యవర్గ సభ్యుడు శరవణన్ పుదుచ్చేరి నుంచి ఈనెల 8న సైకిళ్లపై బయలుదేరారు. రోజుకు 90 కి.మీ. మేర 750 కి.మీ. ప్రయాణించి శనివారం ఖమ్మం వచ్చారు. వీరికి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ స్వాగతం పలికారు.

# ట్రంప్ ఓ నేరస్థుడు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఓ నేరస్థుడని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ధ్వజమెత్తారు. ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలకు ఆయన మద్దతిస్తున్నారని విమర్శించారు. దేశంలో వేల మంది చనిపోవడానికి ఆందోళనకారులే కారణమని ఆరోపించారు. ప్రభుత్వ టీవీ ఛానల్‌ద్వారా శనివారం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఈ తిరుగుబాటుకు అమెరికా అధ్యక్షుడు స్వయంగా ఆజ్యం పోశారు. విద్రోహ శక్తులకు మద్దతిచ్చారు. సైనికపరంగా సాయం చేస్తామని ప్రకటించారు. తద్వారా ఇరాన్‌పై రాజకీయంగా, ఆర్థికంగా పెత్తనం చేయాలని చూశారు. అందుకే ఆయనను నేరస్థుడిగా చూస్తున్నాం. అనేక మంది మరణానికి, విధ్వంసానికి ఆయన కారకుడు. ఇరాన్‌కు వ్యతిరేకంగా ఆయన వ్యవహరించారు. ఆందోళనకారులు అమెరికా కాలికింద చెప్పుల్లాంటివారు. వారు మసీదులను, విద్యాసంస్థలను ధ్వంసం చేశారు. ప్రజలను ఇబ్బందిపెడుతూవేల మంది మరణానికి కారకులయ్యారు' అని ఖమేనీ ధ్వజమెత్తారు. మరోవైపు తన వ్యాఖ్యల ద్వారా ఆందోళనల్లో వేల మంది మరణించిన విషయాన్ని ఆయన అంగీకరించారు. విదేశాల నుంచి అందిన ఆయుధాలతో ఆందోళనకారులు విధ్వంసానికి పాల్పడ్డారని ఖమేనీ ఆరోపించారు. అయితే ఏ దేశాల నుంచి వచ్చాయనే వివరాలను వెల్లడించలేదు.

**--ఆందోళనకారులను వదలిపెట్టం**

'మేమేమీ ప్రణాళిక రచించుకోలేదు. దేశాన్ని యుద్ధం దిశగా తీసుకెళ్లబోం. అయితే దేశంలోని విధ్వంసక శక్తులను వదిలిపెట్టం. అధికారులు వారి కేసులను పరిశీలిస్తున్నారు. దేశంలోని వీరికంటే విదేశీ విధ్వంసకారులే అత్యంత ప్రమాదకరంగా ఉన్నారు' అని ఖమేనీ స్పష్టం చేశారు. ఇరాన్‌పై సానుకూల స్వరంతో ట్రంప్ మాట్లాడిన మరుసటి రోజే ఆయనపై ఖమేనీ విరుచుకుపడటం గమనార్హం. 800 మందికి విధించిన మరణ శిక్షలను ఆ దేశం రద్దు చేసిందని శుక్రవారం ట్రంప్ ప్రకటించారు. అంతేకాదు.. ఆ దేశంపై దాడి చేసే ఆలోచన ఇప్పట్లో లేదని వెల్లడించారు. అయితే తాను ఇరాన్‌లోని ఏ నేతతో మాట్లాడిందీ ఆయన వెల్లడించలేదు.

# రిపబ్లిక్ డేకు ఉగ్ర ముప్పు

ఈ కబురు, దిల్లీ: ఈ ఏడాది గణతంత్ర వేడుకలను ఉగ్ర సంస్థలు లక్ష్యంగా చేసుకునే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా పని చేస్తున్న సంస్థలు దిల్లీసహా దేశంలోని ప్రముఖ నగరాల్లో దాడులకు ప్రయత్నించవచ్చని తెలిపాయి. దేశ అంతర్గత భద్రతను దెబ్బతీసేందుకు ఖలిస్థానీ, ఇతర రాడికల్ హ్యాండ్లర్లు స్థానిక గ్యాంగ్‌స్టర్లను ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నాయి. హరియాణా, పంజాబ్, దిల్లీ, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్‌లలో ఉగ్ర నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు సమాచారం అందినట్లు తెలిపాయి. గతేడాది దిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు జరిగిన నేపథ్యంలో నిఘా వర్గాల హెచ్చరికలపై అధికారులు అప్రమత్తమయ్యారు. దిల్లీ సహా ఇతర ప్రముఖ నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేశారు.



# పదేళ్లలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేశారా?

అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలదీశారు. జిల్లాల పర్యటనలో భాగంగా శనివారం మహ బూబ్‌నగర్‌కు వచ్చిన ఆయన రూ.1,284 కోట్ల వ్యయంతో చేపట్టిన ట్రిపుల్ ఐటీ భవన నిర్మాణాలు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పునరుద్ధరణ, బలోపేతం వంటి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంవీఎస్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు.

--ఎలా పాలించాలో మాకు తెలుసు

'నేను సీఎం అయి రెండేళ్లు కాలేదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు నన్ను దిగిపో దిగిపో అంటున్నారు. సీఎం కుర్చీ ఏమైనా మీ జాగీరా? మీ తాతలు ఇచ్చిన ఆస్తినా? 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలు ఆశీర్వదించి నన్ను ఈ కుర్చీలో కూర్చోబెట్టారు. పాలన ఎలా చేయాలో.. సమస్యలు ఎలా పరిష్కరించాలో మాకు తెలుసు. ఇంకా పదేళ్లు మేమే ఉంటాం. నచ్చితే ఆశీర్వదించు. నచ్చకపోతే నీ ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకో. శుక్రాచార్యులు, మారీచులు, సుబాహులు, రాక్షసులను కట్టడిచేసే సత్తా పాలమూరు బిడ్డకు ఉంది.

--గొప్పలు చెబుతున్న ప్రతిపక్షం

ప్రతిపక్షంలో ఉన్నవారు మేము విజయాలు సాధించామని గొప్పలు చెబుతున్నారు. కానీ తెలంగాణ మొదటి సీఎం కేసీఆర్ మహబూబ్‌నగర్ జిల్లాకు ఏ ఒక్క కొత్త ప్రాజెక్టు అయినా మంజూరు చేసిండా? లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం మూడేళ్లలో కూళేశ్వరం అయింది. డిండి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, సంగంబండ, పాలమూరు-రంగారెడ్డి తదితర ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి పాలమూరు ఎంపీ విఠల్‌రావు పాలమూరు పథకం గురించి నాటి సీఎం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆయన అకాల మరణం తర్వాత దీంతో పాటు జలయజ్ఞంలో ప్రారంభించిన ప్రాజెక్టులు ఆగిపోయాయి. 2014లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పదేళ్లుగా పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేయలేదు. ఈ పథకానికి రూ.25 వేల కోట్ల బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించి, ఉద్దండాపూర్ నిర్వాసితులకు ఎందుకు పరిహారం ఇవ్వలేదు? కల్వకుర్తి ప్రాజెక్టు భూసేకరణకు ఎందుకు నిధులు ఇవ్వలేదు? బీమా-1లో భాగంగా సంగంబండ రిజర్వాయర్ కాల్వకు అడ్డుగా బండ ఉంటే.. దాన్ని తొలగించేందుకు రూ.12 కోట్లు కూడా ఇవ్వలేదు. నేను సీఎం అయిన తర్వాత వీటికి నిధులు మంజూరు చేశా. జూరాల వద్ద నూతన బ్రిడ్జి కావాలని అడిగితే రూ.123 కోట్లు మంజూరు చేశాం. కేసీఆర్ ఈ పనులు ఎందుకు చేయలేదు?..' అని ముఖ్యమంత్రి నిలదీశారు.

--ఈ ప్రాంతంపై ఎందుకు వివక్ష?

'మక్తల్-నారాయణపేట-కొడంగల్ పథకం ఆషామాషీగా రాలేదు. అప్పటి నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి.. అప్పటి సీఎం వైఎస్సార్‌తో మాట్లాడి ఈ ప్రాంతానికి నీళ్లు కావాలని, ఎత్తిపోతలు అవసరమని, బీమా ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టు కింద నిధులు ఇవ్వాలని కోరారు. కానీ వారి అకాల మరణంతో ఈ ప్రాజెక్టు ఆగిపోయింది. నేను కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచాక ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం వెంటపడటంతో రూ.1,500 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టాలని పేర్కొంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరి జీఓ 69 జారీ చేశారు. కానీ పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంతానికి అన్యాయం చేసింది. ఈ ప్రాంతంపై ఎందుకు వివక్ష చూపించారు? గత ప్రభుత్వంలో సీఎంను కలిసి ప్రాజెక్టులను పూర్తి చేయాలని అడిగేందుకు ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు ధైర్యం చేయలేదు. మీరు ఇప్పుడు వచ్చి.. మేము పనులు చేస్తుంటే తప్పు పడుతుండడం మీ చేతగానితనం..' అని రేవంత్ అన్నారు.

--రూ.20 లక్షల కోట్ల లెక్కలేవి?

'కేసీఆర్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఖర్చు చేసిన రూ.20 లక్షల కోట్ల వివరాలు చెప్పలేదు. తమ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, పరిశ్రమలు వచ్చాయని, ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటున్న మీరు ఈ రూ.20 లక్షల కోట్లు ఎక్కడ ఖర్చు చేశారనేది ఎందుకు చెప్పడం లేదు?

--పాలమూరులో ఐఐఎం!

రేవంత్‌రెడ్డి పదేపదే ప్రధాని మోదీని కలుస్తున్నారని నేనంటే గిట్టని వాళ్లు కొందరు అంటున్నారు. తెలంగాణకు నిధులు, అనుమతులు సాధించుకునేందుకు ప్రధానిని కలిస్తే తప్పేంటి. హైదరాబాద్ రాష్ట్రానికి బూర్గుల రామకృష్ణారావు మొదటి సీఎం కాగా.. 75 ఏళ్ల తర్వాత పాలమూరు బిడ్డకు రెండోసారి రాష్ట్రానికి సీఎంగా అయ్యే అవకాశం దక్కింది. ఇక్కడి ఎంపీ డీకే అరుణతో కలిసి మోదీని కలుస్తాం. తెలంగాణకు ఐఐఎం ఇవ్వమని అడుగుతా. దీన్ని పాలమూరులో ప్రారంభించుకుందాం. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవు. ఉచితంగా ఏమి ఇచ్చినా అది శాశ్వతం కాదు. విద్య ఒక్కటే శాశ్వతం. విజ్ఞానం ఉంటేనే రాష్ట్రాన్ని, దేశాన్ని ఏలగలిగే స్థాయికి చేరతాం. కాబట్టి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జీవితంలో పైకి రావాలి..' అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



# ఎదురుకాల్పుల్లో..

అయితే మావోయిస్టు టాప్ లీడర్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్, వ్యూహకర్త మోంగు పాపారావు మావోయిస్టులతో సమావేశం నిర్వహించారనే సమాచారంతో బలగాలు అప్రమత్తం అయ్యాయి.

దాదాపు 500 మంది బలగాలు మావోయిస్టులను చుట్టుముట్టారు. బలగాలను గుర్తించిన మావోలు కాల్పులు జరపడంతో బలగాలు ఎదురు కాల్పులు జరిపాయి. ఈ ఎదురు కాల్పుల్లో డివిసిఎం సభ్యుడు దిలీప్ వేడ్జా, ఒక మహిళా మావోయిస్టుతో సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. శనివారం ఉదయం నుంచి జరిగిన ఎదురు కాల్పుల్లో పాపారావు తప్పించుకున్నట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు. పాపారావు కోసం ఇంకా అడవులను గాలిస్తున్నట్లు బీజాపూర్ ఎస్ పి జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఎన్కౌంటర్ లో పలు ఆయుధాలు లభ్యం అయినట్లు అధికారులు పేర్కొన్నారు.



# 'గద్దె'నెక్కిన అభివృద్ధి



**––మునుపెన్నడూ లేనివిధంగా...**

మహాజాతర సందర్భంగా భక్తులు సమ్మక్క, సారలమ్మల గద్దెలను దర్శించుకుని ఆ పక్కనే ఉన్న గోవిందరాజు, పగిడిద్ద రాజుల గద్దెలకూ మొక్కులు సమర్పిస్తారు. జాతర కొనసాగే రోజుల్లో కిక్కిరిసిపోతున్న ప్రాంగణంలో భక్తులు అవస్థలు పడేవారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ప్రాంగణాన్ని ఆదివాసీల ఆచార వ్యవహారాలు, సంస్కృతికి అనుగుణంగా పవిత్రంగా, శాశ్వత ప్రాతిపదికన తీర్చిదిద్దింది. మొత్తంగా మేడారం అభివృద్ధికి ప్రభుత్వం రూ.251 కోట్లు కేటాయించగా... అందులో రూ.101 కోట్లను గద్దెల ప్రాంగణానికి ఖర్చు చేస్తున్నారు.

**––భక్తుల రద్దీ, వర్షా లను తట్టుకుని...**

గతంలో మేడారం వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు... స్వల్పకాల ప్రణాళికతో మేడారం ప్రాంగణ పునర్ నిర్మాణం, విస్తరణ ప్రారంభమైంది. ఆర్అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. వర్షాలతో పలుమార్లు ఆటంకాలు కలిగాయి. మరోవైపు దర్శనానికి తరలివస్తున్న లక్షల మంది భక్తుల మధ్యే భారీ రాతి ప్రాకారాలను అత్యంత జాగ్రత్తగా అమరుస్తున్నారు. ఇప్పటివరకు 98% పనులు పూర్తయ్యాయి.

**––200 ఏళ్లు చెక్కుచెదరకుండా నిర్మాణాలు; -పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి**

వనదేవతల గద్దెల ప్రాంగణాల పునర్నిర్మాణంలో పాలుపంచుకోవడం పూర్వజన్మ సుకృతం. ఇలాంటి అవకాశం నాకు తెలిసి ఒకరిద్దరికే దక్కుతుంది. మొదట ముఖ్యమంత్రి నాకు ఈ బాధ్యతను అప్పగించి పూర్తి చేయగలమా అన్నప్పుడు... ఒక రోజు సమయం తీసుకుని, తప్పకుండా చేస్తామని చెప్పి కార్యాచరణలోకి దిగాను. 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా నిర్మాణాలు చేస్తున్నాం. జాతర సమయంలోనే హడావుడి చేయకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నాం. కొత్తగా 19 ఎకరాల భూసేకరణ చేశాం. మరో 43 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఎన్ని కోట్ల మంది జాతరకు వచ్చినా తృప్తిగా దర్శనం చేసుకుని వెళ్లేలా రోడ్లు, స్నానఘట్టాలు నిర్మిస్తున్నాం.

**––వందేళ్ల కాలంలో ఇదో అద్భుతం ; - డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, స్తపతి**

వందేళ్ల చరిత్రను పరిశీలిస్తే ఇంత బృహత్తర కార్యక్రమాన్ని తక్కువ సమయంలో ఎక్కువ మంది శిల్పులతో పూర్తి చేయడం అరుదైన ఘట్టంగా చెప్పొచ్చు. గిరిజన తెగల ఇష్టం మేరకు రాయి ఎంపిక, శిల్పాలను చెక్కడం, చెక్కిన రాళ్లను అమర్చడంలో నావంతు పాత్ర పోషిస్తున్నా.

**––అందరికీ అర్థమయ్యేలా శిల్పాలు, చిహ్నాలు ; -డాక్టర్ డి.హరిప్రసాద్, శిల్పి**

ఆదివాసీ సంస్కృతిని, వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం వచ్చింది. శిల్పాలు, ప్రాకారాలను తీర్చిదిద్దడంలో నాతోపాటు నా బృందం ఎంతో శ్రమించింది. అరుదైన శిల్పాలు, చిహ్నాలను అందరికీ అర్థమయ్యేలా చెక్కాం. ఆదివాసీ సంస్కృతిని శిల్పాల రూపు ఇవ్వడం ఇదే తొలిసారి.

**––గొట్లు-గోత్రాల చిహ్నాలు అందించాం ; -మైపతి అరుణ్‌కుమార్, ఆదివాసీ చరిత్ర పరిశోధకుడు**

15 ఏళ్లుగా చరిత్రపై అన్వేషణ చేస్తున్నాం. ఆదివాసీల వంశవృక్షాలు, గోత్రాలు కనుమరుగవుతున్నాయని గుర్తించాం. ఆదివాసీల 236 వేల్పు జాతరలను వెలుగులోకి తెచ్చాం. పూర్వీకుల చరిత్రను గుర్తించాం. దేశంలో ఆదివాసీలకు గుడులు కట్టించిన చరిత్ర లేదు. మేడారంలో ప్రభుత్వం గద్దెల పునర్నిర్మాణం చేపట్టడాన్ని దృష్టిలో పెట్టుకుని పూజారులతో కలిసి కావాల్సిన గొట్లుగోత్రాల చిహ్నాలను అందజేశాం. వాటినే ఇక్కడ శిల్పాలుగా మలిచారు.

**––ఏమిటీ ప్రత్యేకత.. ఎలా నిర్మించారంటే...**

మేడారం అంటే ఆదివాసీల ప్రాచీన వైభవం, సంస్కృతికి నిలువుటద్దం. అందుకే ప్రభుత్వం... గిరిజన పెద్దలు, ఎనిమిది రకాల గోత్రాలున్న పూజారులు, స్థానిక తెగల నాయకులతో చర్చించి, బృహత్ ప్రణాళికను సిద్ధం చేసింది. దాన్ని అమలు చేసే క్రమంలో శిల్పులు... ప్రధాన రహదారిపై 50 అడుగుల ప్రధాన ద్వారం, ఎనిమిది ప్రాంగణ ద్వారాలు నిర్మించారు. రెండు పెద్ద గద్దెలు, రెండు చిన్నవి సమాంతరంగా వచ్చేలా తీర్చిదిద్దారు. ఎంతమంది భక్తులొచ్చినా సులువుగా దర్శనమయ్యేలా ప్రాంగణాన్ని విస్తరించారు. గద్దెలకు ఇరువైపులా భక్తులు వెళ్లే మార్గాల్లో క్యూలైన్ల కోసం

రెం డు
చి న్న
తో ర
ణా
ల ను

కొత్తగా నిర్మించారు. 21 అడుగుల ఎత్తున రాతి స్తంభాలు ఏర్పాటు చేశారు. ప్రాకారాలపై కొమ్ము కిరీటాలు, స్థానిక కోయ తెగల సంప్రదాయం, సాంస్కృతిక ఔన్నత్యం ప్రతిబింబించేలా చెక్కారు. గిరిజన తెగల చిహ్నాలు, వన దేవతలు, తెగలకు సంబంధించిన చిహ్నాలన్నీ స్తంభాలపై దర్శనమిస్తున్నాయి. ప్రాంగణానికి రాతి ప్రహరీ ఏర్పాటు చేసి 50 వరకు శిలాఫలకాలను తీర్చిదిద్దారు. ఒక ఫలకంపై వెలుపలి వైపు స్థానిక తెగల జనజీవన శైలి, లోపలవైపు వనదేవతల స్థల పురాణాన్ని చెక్కారు. వన పోతరాజు, నాగులమ్మ దేవాలయాలను 1984లో అప్పటి రాష్ట్రప్రభుత్వం నిర్మించగా వాటిని పునరుద్ధరించారు.

చిహ్నాల ఎంపికలో వనదేవతల చరిత్రపై రెండు దశాబ్దాలుగా పరిశోధనలు చేస్తున్న డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ సహకారాన్ని, అందరి గిరిజన పూజారుల సమ్మతిని తీసుకున్నారు. శిల్పి డి.హరిప్రసాద్ పర్యవేక్షణ, స్తపతి ఈమని శివనాగిరెడ్డి పరిశీలనలో ప్రాంగణం ముస్తామైంది. కోయ తెగల పెద్దలు సూచించిన ప్రకారం తెల్ల గ్రానైట్ రాయిని ఏపీలోని రాయచోటిలో ఒకేచోట భారీక్వారీలో గుర్తించారు. లక్ష ఘనపు అడుగుల పరిమాణంలో స్తంభాలు, ప్రాకారాలను 249 మంది శిల్పులు అక్కడే మలిచారు. వాటిని భారీ వాహనాలతో తరలించారు. మేడారంలో 125 మంది శిల్పులు వాటిని అమర్చారు.

**––సీఎం ఆలోచన.. పట్టుదలతోనే..**

ప్రతిసారీ తాత్కాలిక పనులతో సరిపెట్టడం కాకుండా.. మేడారం జాతర సందర్భంగా అక్కడ శాశ్వత వసతులు కల్పించాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన, పట్టుదలతోనే అభివృద్ధి పనులకు బీజం పడింది. 2023 శాసనసభ ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్షుడిగా ఆయన పాదయాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించారు. ఎన్నికల్లో పార్టీ విజయకేతనం ఎగరేయటంతో సీఎంకు మేడారం భావోద్వేగ బంధంగా మారింది. మహాజాతరకు నిధుల విషయమై మంత్రి సీతక్క, అధికారులు ఆయన్ను కలవగా.. గతంలో కంటే రెట్టింపుగా రూ.150 కోట్లు కేటాయించి శాశ్వత పనులకు ఆదేశించారు. గద్దెల ప్రాంగణ పునర్నిర్మాణం, విస్తరణ కోసం అదనంగా రూ.101 కోట్లు కేటాయించారు. ఈ పనులు చేపట్టేందుకు స్తపతులు, శిల్పులు, ఆదివాసీ పూజారులతో మాట్లాడి మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో సీఎం ప్రతి దశలోనూ స్వయంగా శ్రద్ధ చూపారు. పనుల పర్యవేక్షణ బాధ్యతను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కలకు అప్పగించారు. యుద్ధప్రాతిపదికన వంద రోజుల్లోనే పనులు పూర్తయ్యేలా అనుశీలన చేశారు. మొదటిసారి రాజధాని వెలుపల మంత్రివర్గ సమావేశాన్ని మేడారంలోనే నిర్వహిస్తుండడం మరో విశేషం.

# చరిత్ర గురించి నేటితరం తెలుసుకోవాలి



. మన పూర్వీకుల త్యాగాలు, కష్టాలు, దేశ చరిత్ర గురించీ వారికి వివరించాలని, లేదంటే భవిష్యత్తును అర్థం చేసుకోలేరని పేర్కొన్నారు. రాజస్థాన్‌లో జరుగుతున్న జైపుర్ సాహిత్య వేడుకల్లో సుధామూర్తి ప్రసంగించారు. దేశ విభజన కోసం ఆనాడు తీసుకున్న ఓ తప్పుడు నిర్ణయం ఎన్నోతరాలపై ప్రభావం చూపిస్తోందని ఆమె వివరించారు. భారత సంప్రదాయాలు, సంస్కృతి, భాషల గురించి అవగాహనలేని ఓ వ్యక్తి (నాటి వైస్రాయ్‌ను ఉద్దేశించి) పెన్సిల్‌తో గీతగీసి ఇవి మీ సరిహద్దులని చెప్పారన్నారు. ఆ విభజన కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాలకు వలస వెళ్లినవారి గురించి ఆలోచిస్తే ఎంతో బాధగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసారి పాకిస్థాన్‌కు వెళ్లినప్పుడు అక్కడి మ్యూజియంకు వెళ్తే తాను విదేశీయురాలినని ఎక్కువ ఛార్జ్ చేశారని సుధామూర్తి పేర్కొన్నారు. అది ఒకప్పుడు మన అఖండ భారతంలోని భాగమేనని, సరిహద్దుల కారణంగా విదేశమైందన్న ఆలోచన తనకు ఎంతో బాధను కలిగించిందని గుర్తుచేసుకున్నారు. ఈ విషయాలన్నీ యువతరానికి తెలియజేసేందుకు 'ది మ్యాజిక్ ఆఫ్ ది లాస్ట్ ఇయర్‌రింగ్స్' పుస్తకాన్ని రాసినట్లు పేర్కొన్నారు. తన మనవరాలు అనౌష్కశర్మను ఆధారంగా చేసుకునే ఈ పుస్తకంలోని ప్రధాన పాత్రను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

# జిల్లాల రద్దుకు సీఎం కుట్ర



**–దీనిపై ఉద్యమ కార్యాచరణకు సిద్ధం కావాలి**
**––పుర ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి**
**–ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ముఖ్యనేతలతో కేటీఆర్**

ఈ కబురు, హైదరాబాద్: గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన జిల్లాల రద్దుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలపై ఉద్యమ కార్యాచరణకు సిద్ధం కావాలని తమ పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండల పరిధిలోని పార్టీ జిల్లాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు, ముఖ్యనేతలతో శనివారం కేటీఆర్ సమావేశం నిర్వహించి... దిశానిర్దేశం చేశారు. ''పాలమూరులో ఉన్న ప్రత్యేక పరిస్థితుల్లో పరిపాలన వికేంద్రీకరణ కోసం కేసీఆర్ నాడు కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. పాలమూరు జిల్లా బిడ్డగా చెప్పుకొంటున్న రేవంత్‌రెడ్డి మాత్రం వాటిని రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్నారు. దీంతోపాటు పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో జరుగుతున్న ఆలస్యం, కృష్ణా జలాల వాటావంటి కీలక అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఈ రెండు అంశాలపై ప్రజలను చైతన్యపరిచేలా కార్యక్రమాలను చేపట్టాలి.

**--పురపాలిక ఎన్నికల్లోనూ దూసుకుపోవాలి...**

ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల పరిధిలో పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాం. ఇదే స్ఫూర్తితో పురపాలిక ఎన్నికల్లోనూ దూసుకుపోవాలి. ప్రతి పురపాలిక వారీగా ప్రత్యేక కార్యాచరణతో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పని చేయాలి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రస్తుత రాష్ట్ర మంత్రివర్గంలో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులున్నా ప్రజలకు చేసిందేమీ లేదు. ఒకప్పుడు వెనుకబడిన నల్గొండను కేసీఆర్ ఎలా అభివృద్ధి చేశారో ప్రజలకు గుర్తుచేయాలి. 24 నెలలుగా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తున్న తీరును, సంక్షేమ పథకాలను రద్దు చేసుకుంటూ వెళ్తున్న వైనాన్నీ వివరించాలి. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అన్ని పురపాలికల్లో టీయూఎఫ్ఐడీసీ, పురపాలిక శాఖ ద్వారా రూ.వందల కోట్లతో చేసిన అభివృద్ధి గురించి చెప్పాలి'' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు మాట్లాడుతూ... రాబోయే పుర ఎన్నికలతోపాటు పలు అంశాలపై ముఖ్యనేతలకు పార్టీ అవలంబించాల్సిన వ్యూహంపై వివరించి చెప్పారు.

# ఆఫ్రికా దక్షిణ దేశాల్లో కుండపోత వర్షాలు



**–100 మందికి పైగా మృతి**

**ఈ కబురు, నెట్‌వర్క్:**
ఆఫ్రికా దక్షిణ ప్రాంతంలోని మొజాంబిక్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా దేశాలలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు 100 మందికి పైగా మృతి చెందారు. లక్షల మంది నిరాశ్రయులయ్యారు. రానున్న రోజుల్లో మరింత ఎక్కువగా వర్షాలు కురవొచ్చన్న వాతావరణ శాఖ హెచ్చరికలు వారిని మరింతగా కలవరపెడుతున్నాయి. మొజాంబిక్‌లో వర్షాలు, వరదల కారణంగా 2 లక్షల మందికి పైగా ప్రభావితులయ్యారు. వేల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. జింబాబ్వేలో వర్షాల వల్ల 70 మంది మరణించగా.. 1000కి పైగా ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. పాఠశాలలు, రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. దక్షిణ ఆఫ్రికాలో మృతుల సంఖ్య 30 చేరింది. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. హెలికాప్టర్లను రంగంలోకి దించి, బాధితుల్ని రక్షిస్తున్నారు. ప్రఖ్యాత క్రుగార్ నేషనల్ పార్క్‌ను కూడా ఈ వరదలు ప్రభావితం చేశాయి. అందులో చిక్కుకున్న 600 మంది పర్యాటకులు, పార్కు సిబ్బందిని సహాయక బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. లా నినా వల్ల వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల ఆఫ్రికాలోని ఏడు దేశాలను వర్షాలు ముంచెత్తుతున్నాయని అమెరికా వాతావరణ హెచ్చరికల వ్యవస్థ తెలిపింది.

# కాంగ్రెస్, భాజపాల మధ్యే పుర'పోరు'

**–భారత రాష్ట్ర సమితి త్వరలో ముక్కలు కావడం ఖాయం**
**–గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తాం**
**–'విజయ సంకల్ప సమ్మేళనం'లో భాజపా నేతలు**

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాల మధ్యే పోటీ ఉంటుందని కేంద్ర మంత్రులు, పార్టీ నేతలు పేర్కొన్నారు. హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరిస్తారని, భాజపాను ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని వారు ధీమా వ్యక్తం చేశారు. భారత రాష్ట్ర సమితిలో ఆస్తుల తగాదా నడుస్తోందని... ఆ పార్టీ త్వరలో ముక్కలు కావడం ఖాయమన్నారు. పుర ఎన్నికల్లో ఎక్కువ సంఖ్యలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను కైవసం చేసుకునేందుకు కార్యకర్తలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గెలుపు గుర్రాలకు మాత్రమే టికెట్లు ఇవ్వాలని సూచించారు. శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసికల్ గార్డెన్‌లో భాజపా 'విజయ సంకల్ప సమ్మేళనం' నిర్వహించింది. దీనికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతోపాటు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పదాధికారులు హాజరయ్యారు. జిల్లాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్న ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు నేతలు దిశానిర్దేశం చేశారు.

**––సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి: కిషన్‌రెడ్డి**

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... జంట నగరాల్లో ఎన్నో ఏళ్లుగా కీలకంగా ఉన్న సికింద్రాబాద్ కేంద్రంగా మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పేరు లేకుండా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ చేయాలని ప్రభుత్వం భావిస్తుండటం సరికాదన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి పునరాలోచించాలని, లేకపోతే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

''మున్సిపల్ ఎన్నికల్లో ఏ ఒక్క స్థానాన్నీ తేలిగ్గా తీసుకోవద్దు. రాష్ట్రంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు లేనప్పుడే.. పురపాలికలను కైవసం చేసుకున్నాం. ఈసారి ప్రజాప్రతినిధుల బలం ఉంది. మద్దతు ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. దాన్ని అందిపుచ్చుకొని అన్ని స్థానాల్లోనూ సత్తా చాటాలి. ఎస్సీ, ఎస్టీలు, మహిళల స్థానాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో భాజపా ఎంపీలు నెగ్గారు. జహీరాబాద్, పెద్దపల్లిల్లో కొన్ని తప్పిదాల వల్ల ఓడిపోయాం. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్లు ఇచ్చే అధికారం ఏ ఒక్కరికో లేదు. బృందంగా నిర్ణయం తీసుకుంటాం. పార్టీలోని సీనియర్ నేతలు కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేయాలి. తమ హోదాకు ఆ పదవి తక్కువని భావించవద్దు'' అని కిషన్‌రెడ్డి అన్నారు.

**––కేంద్రం నుంచి అధిక నిధులు తెస్తాం**

కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ... ''మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడొచ్చినా శ్రేణులు సిద్ధంగా ఉండాలి. ఈ ఎన్నికలు కాంగ్రెస్, భాజపా మధ్యే ఉంటాయి. భాజపాను ఓడించేందుకు కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిలతో కలిసి ఎంఐఎం కుట్రలు పన్నుతోంది. డబ్బులు పంచి గెలుద్దామని ఆ పార్టీలు చూస్తున్నాయి. రెండు సర్వేలు నిర్వహించిన తర్వాత అభ్యర్థులను ఎంపిక చేయాలి. ఒక్కో అభ్యర్థి ఆరు సార్లు ఇంటింటి ప్రచారం చేయాలి. జాతీయ అంశాలపై కాకుండా స్థానిక అంశాలపై ప్రచారం చేయాలి. కేసులు, అరెస్టులకు భయపడొద్దు. మున్సిపల్ ఎన్నికల తర్వాత తెలంగాణపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారిస్తుంది. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే గెలుపు. పార్టీ గెలిచిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు కేంద్రం నుంచి భారీగా నిధులు తెచ్చే బాధ్యత నేను, కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు తీసుకుంటాం'' అని అన్నారు.

**––కాంగ్రెస్ అవినీతిని ఎండగట్టాలి**

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు మాట్లాడుతూ.. ''గతంలో అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితిని మించిపోయేలా కాంగ్రెస్ సర్కారు అవినీతికి పాల్పడుతోంది. ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. భాజపా గెలుపొందినచోట నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని భరోసా కల్పించాలి. ఇటీవలి ఎన్నికల్లో 5 వేల గ్రామపంచాయతీల్లో భాజపా మద్దతుదారులు పోటీ చేయగా... వెయ్యి చోట్ల గెలుపొందారు. భారత రాష్ట్ర సమితి మద్దతుదారులు 10 వేల చోట్ల పోటీ చేసి 2 వేల చోట్ల మాత్రమే నెగ్గారు. ఇతరులు గెలిచిన పంచాయతీ స్థానాలూ తమవేనని కాంగ్రెస్ చెబుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో భాజపా పోటీ చేస్తుంది'' అని పేర్కొన్నారు.

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో భాజపా గెలిస్తే పట్టణాలకు కేంద్రం నిధులు వస్తాయని ప్రజలకు వివరించాలన్నారు. భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ ఓట్ల కోసమే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కన్నా ముందే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఆరోపించారు. నిర్మల్‌లో గతంలో 30 వేల మైనారిటీ ఓట్లుండగా ఇప్పుడు 40 వేలకు పెంచారన్నారు. ఎన్నికల్లో శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ సంస్థాగత కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్‌లు దిశానిర్దేశం చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్‌గౌడ్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీలు ఎం.రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గోడం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్, ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమరయ్య, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతంరావు, అశోక్, మహిళా నేతలు బండ కార్తీకరెడ్డి, కొల్లి మాధవి, రాష్ట్ర పదాధికారులు, జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# బంగ్లాలో మరో హిందువు హత్య



**ఈ కబురు, నెట్‌వర్క్ :**
బంగ్లాదేశ్‌లో మరో హిందూ యువకుడి హత్య జరిగింది. వాహనంలో ఇంధనం నింపుకొని డబ్బులు చెల్లించకుండా వెళ్తున్న దుండగులను అడ్డుకునే క్రమంలో రిపన్ సాహా అనే 30 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయారు. దుండగులు వాహనాన్ని ఆపకుండా అతడిని తొక్కించుకుంటూ వెళ్లారు. దీంతో సాహా మరణించారు. రాజ్‌బరీ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. గోలంద మోర్‌లోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపన్ సాహా పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో నలుపు రంగు ఎస్‌యూవీలో కొందరు పెట్రోలు స్టేషన్‌కు వచ్చారు. 5వేల టాకాల (రూ.3,710) ఇంధనం నింపుకొన్నారు. ఆ వెంటనే బిల్లు చెల్లించకుండా వాహనాన్ని ముందుకు కదిలించారు. వారిని ఆపేందుకు సాహా ప్రయత్నించారు. కానీ వారు అతడిని తొక్కించుకుంటూ వెళ్లారు. దీంతో సాహా అక్కడికక్కడే మరణించారు. సాహాపై వాహనాన్ని పోనిచ్చి అతడి మృతికి కారణమైన దాని యజమాని అబ్దుల్ హషీం అలియాస్ సుజాన్ (55), అతడి డ్రైవరు కమల్ హుసేన్ (43)ను పోలీసులు అరెస్టు చే

# ఆటో నడిపినవాడు... ఆకాశమంత ఎదిగాడు



'ఒక్కో ప్రయాణికుడి నుంచీ పదిరూపాయలు... అలా ప్రతి ట్రిప్పుకీ వందరూపాయలు. రోజంతా షేర్ ఆటో నడిపితే... అన్ని ఖర్చులూ పోగా రూ.500 మిగిలితే చాలు!' పదహారేళ్ల కిందట ఇదొక్కటే శ్రవణ్ కుమార్ విశ్వకర్మ లక్ష్యంగా ఉండేది. కానీ, సంవత్సరమంతా ఆటో నడిపినా అది సాధ్యం కాలేదు... అప్పులు మాత్రమే మిగిలాయి. అలాంటివాడు నేడో విమాన యాన సంస్థకు సొంతదారంటే... ఏ సినిమా కథకో వన్‌లైనర్‌లా అనిపిస్తుంది కానీ శ్రవణ్ విషయంలో అది నిజమైంది. కఠోర శ్రమకి సాహసాన్ని జోడించి ఓ సామాన్యుడు సాధించిన అద్భుతం ఇది...


**'ఉన్నావ్"...** ఉత్తర్‌ప్రదేశ్‌లోని పట్టణాల్లో ఒకటి. గంగానదికి ఓ వైపు కాన్పూర్ నగరం ఉంటే మరో వైపు ఉన్నావ్ ఉంటుంది. ఉన్నావ్ నుంచి నదీతీరాన ఆరేడు కిలోమీటర్లు వెళితే చాంద్‌పూర్ అనే కుగ్రామం వస్తుంది. అదే శ్రవణ్‌కుమార్ విశ్వకర్మ స్వస్థలం. ఆ పల్లెలో జీవనం గడవక పొట్టచేతపట్టుకుని ఉన్నావ్ వచ్చారు వాళ్లు. అక్కడ ఇనుప సామాన్లు అమ్మే చిరువ్యాపారిగా మారాడు శ్రవణ్‌కుమార్ తండ్రి. వచ్చేది బొటాబొటి ఆదాయమే అయినా... శ్రవణ్‌నీ అతని చెల్లెల్నీ ప్రైవేటు స్కూలుకే పంపించారు ఆ తల్లిదండ్రులు. కానీ శ్రవణ్‌కేమో చదువు బుర్రకెక్కలేదు. అతని మనసంతా నాన్న చేసే వ్యాపారంపైనే ఉండేది. బడి నుంచి నేరుగా దుకాణానికి వెళ్లిపోయి ఆయనకి చేదోడుగా ఉండేవాడు. పదో తరగతితోనే చదువు మానేశాడు. సరిగ్గా అదే సమయంలో వాళ్ల నాన్న గంగానదికి ఆవలనున్న కాన్పూర్ నగరానికి మకాం మార్చాడు. అక్కడ వాళ్ల ఇనుప సామాన్ల వ్యాపారం చక్కగా పుంజుకుంటూ ఉండగానే... ఆయన అనారోగ్యంతో చనిపోయాడు. దాంతో కుటుంబభారాన్ని మోసే బాధ్యత పదహారేళ్ల శ్రవణ్ లేతభుజాలపైన పడింది...

**లోడు డ్రైవర్‌గా...** ఇంటికి పెద్ద దిక్కులేక, తండ్రి చేస్తున్న వ్యాపారాన్ని మూసేయాల్సి వచ్చింది. కాన్పూర్‌లో షామియానాలు అద్దెకిచ్చే తన మేనమామ దగ్గరే పనివాడిగా చేరాడు శ్రవణ్‌కుమార్. మెల్లగా టెంటు సామాన్లని తీసుకెళ్లే చిన్నలారీని నడపడం నేర్చుకున్నాడు. డ్రైవింగ్‌తోపాటూ లోడింగ్ అన్‌లోడింగ్ పనులన్నీ చేస్తుండేవాడు. ఆ వచ్చిన కూలీతో చెల్లెల్ని చదివిస్తూనే... కొంత కూడబెట్టాడు. ఆ డబ్బుతో మిత్రులతో కలిసి రుణంపైన 'టెంపో' షేర్ ఆటో కొన్నాడు. తానే డ్రైవర్ అయ్యాడు. కాన్పూర్‌లోని అతిపెద్ద వాణిజ్య కేంద్రం లాటుచ్ నుంచి వివిధ ప్రాంతాలకి నడపసాగాడు. కానీ షేర్ ఆటోల ముసుగున అక్రమ కార్యకలాపాలు నిర్వహించే మాఫియాల బెదిరింపులు అతణ్ని అందులో నిలదొక్కుకోనివ్వలేదు. 'డీజిల్ ఖర్చులు పోగా రోజూ చేతిలో రెండొందలు కూడా మిగిలేవి కావు. కిస్తీ కట్టలేక వడ్డీ పెరిగి ఆటో రుణం పెద్ద భారమైపోయింది. అందులో నుంచి బయటపడాలన్నదొక్కటే దేవుడి దగ్గర నా మొరగా ఉండేది...' అని గుర్తుచేసుకుంటాడు శ్రవణ్. అప్పుడే ఓ సాహసం చేశాడతను. కాన్పూర్‌లో ఓ సిమెంటు కంపెనీ కొత్తగా వస్తే మరోసారి రుణం తీసుకుని దాని ఏజెన్సీని సొంతం చేసుకున్నాడు. రేయింబవళ్లూ ఎక్కడ నిర్మాణాలు జరుగుతున్నా అక్కడికెళ్లి ఆర్డర్లు తెచ్చాడు. అలా జీవితంలో తొలిసారి లాభాలు కళ్లజూశాడు. మరో అడుగు ముందుకేసి భవన నిర్మాణానికి కావాల్సిన వస్తువులన్నీ సరఫరా చేసే ఏజెన్సీని పెట్టాడు. ఆ వచ్చిన లాభాలతో, చిన్నప్పుడు నాన్న చేసిన ఇనుప వ్యాపారంపైన ఇష్టంతో, 'టీఎంటీ' ఇనుప చువ్వల తయారీ రంగంలోకి అడుగుపెట్టాడు. శ్రవణ్ స్థాయికి అది పెద్ద సాహసమే అయినా... ధైర్యంగా ముందుకెళ్లాడు. నాలుగేళ్లలోనే కోటి రూపాయల టర్నోవర్ అందుకున్నాడు.

అక్కడితో ఆగలేదు...

**400 ట్రక్కులు...** తొమ్మిదేళ్ల కిందట కాన్పూర్‌లో సెరామిక్ మైనింగ్ కార్యకలాపాలు ఊపందుకోసాగాయి. దాన్ని ముందుగానే పసిగట్టిన శ్రవణ్‌కుమార్ మైనింగ్‌కి అత్యవసరమైన ట్రక్కుల బిజినెస్ పెట్టాడు. అది ఆరుపువ్వులూ పన్నెండు కాయలైంది! రెండేళ్లలోనే 'శ్రవణ్‌కుమార్ ఏజెన్సీస్' సంస్థ 400 సొంత ట్రక్కులతో ఉత్తర్‌ప్రదేశ్ పారిశ్రామికవేత్తల్లో ఒకడిగా అతణ్ణి నిలబెట్టింది. 'అప్పుడే ఓసారి నేను దిల్లీ నుంచి లఖ్‌నవూకి విమాన ప్రయాణం చేయాల్సి వచ్చింది. పెద్దగా చదువుకోనివాళ్లనీ, సూటూబూటూలేనివాళ్లనీ, నాలాగా ఇంగ్లిషు రానివాళ్లనీ అడుగడుగునా చిన్నచూపు చూడటం గమనించాన్నేను. ఆటో, బస్సులాగే విమానం కూడా ఓ వాహనమే కదా... దానికెందుకు ఇన్ని పటాటోపాలు అనిపించింది. అతి సామాన్యుల కోసమూ ఓ విమానం నడపాలన్న ఆలోచన నాకు అప్పుడొచ్చింది. 2022 నుంచీ ఇందుకోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగితే 'విమానాలంటే లారీలు నడిపినట్టు కాదు..' అంటూ ఎద్దేవా చేశారు నన్ను. వాళ్లతో రెండేళ్లు పోరాడి అనుమతులు తీసుకున్నాను. మా నాన్న రోజూ పూజచేసే శంఖువు గుర్తుగా శంఖ్ ఎయిర్‌లైన్స్ అనే పేరుపెట్టాను...' అంటాడు శ్రవణ్! శంఖ్ ఎయిర్‌లైన్స్‌ని రూ.800 కోట్ల పైచిలుకు రుణం తీసుకుని ప్రారంభించాడు శ్రవణ్! 'అది చాలా పెద్ద రిస్కు కదా...' అని అడిగితే 'ఆటో నడిపిన నేను సిమెంటు వ్యాపారంవైపు అడుగుపెట్టడమే నా జీవితంలో అతిపెద్ద రిస్కు. దానితో పోలిస్తే ఇది చాలా చిన్నదే' అంటూ నవ్వేస్తాడు!

# తగ్గిన ఐసీఐసీఐ బ్యాంక్ లాభం




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526) అక్టోబరు డిసెంబరు త్రైమాసికంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత ప్రాతిపదికన రూ.12,537.98 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం రూ.12,883.37 కోట్లతో పోలిస్తే ఇది 2.68 శాతం తక్కువ. సెప్టెంబరు త్రైమాసికంలో ఐసీఐసీఐ బ్యాంక్ రూ.13,537.06 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. వ్యవసాయ రుణాలను ప్రాధాన్య రంగ రుణాలుగా తప్పుగా వర్గీకరించడంతో ఆర్‌బీఐ ఆదేశాలకు అనుగుణంగా రూ.1283 కోట్ల కేటాయింపులు చేయడం ప్రభావం చూపింది. స్టాండలోన్ ప్రాతిపదికన చూస్తే.. బ్యాంక్ లాభం రూ.11,318 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం 7.7 శాతం వృద్ధి చెంది రూ.21,932 కోట్లకు చేరింది. రుణాలు 11.5 శాతం వృద్ధి చెందడం ఇందుకు కలిసొచ్చింది. నికర వడ్డీ మార్జిన్ 0.05 శాతం పెరిగి 4.30 శాతానికి చేరింది. వడ్డీయేతర ఆదాయం 12.4% వృద్ధితో రూ.7,525 కోట్లకు చేరింది. కొత్త కార్మిక చట్టాలను అమలు చేయడానికి రూ.145 కోట్లు పక్కన పెట్టినట్లు బ్యాంక్ తెలిపింది. దీంతో మొత్తం కేటాయింపులు రెట్టింపు రూ.2,556 కోట్లకు చేరాయి. వ్యవసాయ రుణాలకు సంబంధించి ఆర్‌బీఐ ఆదేశాలకు అనుగుణంగా రూ.1283 కోట్ల కేటాయింపులు ఇందులో ఉన్నాయి. తాజా మొండి బకాయిలు రూ.5,304 కోట్ల నుంచి రూ.5,356 కోట్లకు తగ్గాయి. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.58 శాతం నుంచి 1.53 శాతానికి మెరుగుపడింది. కార్పొరేట్ రుణాలు 5.6 శాతం, రిటెయిల్ రుణాలు 7.2% చొప్పున వృద్ధి చెందాయి. ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈఓ సందీప్ భక్షి పదవీకాలాన్ని రెండేళ్ల పాటు పొడిగించేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది.

# దక్షిణాసియా వృద్ధికి చుక్కాని భారత్

## –ముఖ్య ఆర్థిక వేత్తలతో డబ్ల్యూఈఎఫ్ సర్వే



ప్రపంచ ఆర్థిక పరిస్థితులు ఈ ఏడాది బలహీనంగా ఉంటాయని.. అయితే వృద్ధిపరంగా దక్షిణాసియా వెలుగు చుక్కలా మారుతుందని, ఇందులో భారత్ కీలకపాత్ర వహిస్తుందని ముఖ్య ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. అమెరికా అధిక సుంకాల ప్రభావం వంటివి ఇబ్బంది పెడుతున్నా, భారత్ రాణిస్తుందనే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సర్వే తేల్చి చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వరంగ, ప్రైవేటు కంపెనీల్లోని ముఖ్య ఆర్థిక వేత్తల అభిప్రాయాలతో ఈ నివేదికను రూపొందించినట్లు డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. దావోస్ ఆర్థిక సదస్సుకు ముందుగా 'చీఫ్ ఎకనామిస్ట్స్ అవుట్‌లుక్' పేరిట శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం..కొన్ని అంశాల్లో మెరుగుపడినా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి కొనసాగుతోంది. రుణాలు పెరిగిపోతుండటం, భౌగోళికఆర్థిక ఉద్రిక్తతలు అధికమవ్వడం, కృత్రిమమేధ సాంకేతికత (ఏఐ) వల్ల కొత్త అవకాశాలు వస్తుండగా, ఉద్యోగాల్లో కోతల వంటి నష్టభయాలను ఎదుర్కోవాల్సి వస్తుండటం ఇందుకు కారణం. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు మరింత బలహీనపడతాయని 53% మంది ఆర్థిక వేత్తలు అంచనా వేశారు. 2025 సెప్టెంబరులో ఈ సంఖ్య 72 శాతంగా ఉంది. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణాసియా వృద్ధి పటిష్ఠంగా ఉంటుందని 60% మంది, అత్యంత పటిష్ఠంగా ఉంటుందని 6% మంది పేర్కొన్నారు. ఇందుకు భారత్ కారణమవుతుందని తెలిపారు. గత సెప్టెంబరులో ఇలా అంచనా వేసినవారు 31% మందే. అమెరికా పరిస్థితులు మెరుగవుతాయని 69% మంది, వృద్ధి పటిష్ఠంగా ఉంటుందని 11% మంది అంచనా వేశారు. ఐరోపా వృద్ధి బలహీనంగానే ఉండొచ్చని 53% మంది అంచనా వేశారు. ఒకమాదిరి వృద్ధితో సాగొచ్చని 44% మంది వివరించారు. అమెరికా సుంకాలు ఇబ్బంది పెడుతున్నా, భారత ఆర్థిక వ్యవస్థ సెప్టెంబరు త్రైమాసికంలో 8.2% వృద్ధి చెందడాన్ని నివేదిక ప్రస్తావించింది. కార్మిక సంస్కరణలకు తోడు అమెరికా టెక్నాలజీ సంస్థల పెట్టుబడుల ఫలితంగా ఏఐ వినియోగం పెరుగుతోందని వివరించింది. రాబోయే 10 ఏళ్లలో వృద్ధిపై ఏఐ పెట్టుబడుల ప్రభావం గణనీయంగా సానుకూలంగా ఉంటుందని 36% మంది అంచనా వేశారు. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉన్నా, పరపతి విధానాల్లో మార్పు ఉండకపోవచ్చని 85% మంది పేర్కొన్నారు.

**క్రిప్టోలు, బంగారంపై....** క్రిప్టోకరెన్సీల భవిత ఆశాజనకంగా ఉండకపోవచ్చని, మార్కెట్ ఒడుదొడుకులు ఇందుకు కారణమవుతాయని 62% మంది అంచనా వేశారు. బంగారం ధర గరిష్ఠ స్థాయులకు చేరిందనే 54% మంది పేర్కొన్నారు.

**కృత్రిమ మేధతో స్వల్పంగా ఉద్యోగ కోతలుంటాయ్....** కృత్రిమ మేధ వల్ల ఉత్పాదకత అమెరికా, చైనాల్లో రాబోయే రెండేళ్లలో మెరుగవుతుందనే అంచనాను ప్రతి అయిదుగురు ఆర్థిక వేత్తల్లో నలుగురు వ్యక్తం చేశారు. ఈ సాంకేతికతను స్వీకరించడంలో ఐటీ రంగం వేగంగా ఉంది. తరవాత స్థానాల్లో ఆర్థిక సేవలు, సరఫరా వ్యవస్థలు, ఆరోగ్య సంరక్షణ, ఇంజినీరింగ్, రిటెయిల్ రంగాలుంటాయి. ఏఐ వల్ల ఉద్యోగ కోతలు రాబోయే రెండేళ్లలో కొంతమేర ఉంటాయనే మూడింట రెండు వంతుల మంది ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు. 10 ఏళ్ల పాటు ఉద్యోగ కోతలుంటాయని 57% మంది, దీర్ఘకాలంలో ప్రయోజనాలుంటాయని 37% మంది అంచనా వేస్తున్నారు.

# 1.25 లక్షల టెక్ కొలువులు



భారతీయ టెక్ రంగంలో నియామకాలు తిరిగి ఊపందుకోనున్నాయి. ఈ ఏడాది టెక్ నియామకాలు, గతేడాదితో పోలిస్తే 1215% పెరిగే అవకాశం ఉందని వర్క్‌ఫోర్స్ సొల్యూషన్స్ సంస్థ అడెకో ఇండియా వెల్లడించింది. శాశ్వత, తాత్కాలిక, ఒప్పంద ప్రాతిపదికన జరిగే ఈ నియామకాల ద్వారా దాదాపు 1.25 లక్షల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయని తెలిపింది. గతంలో డిజిటల్ సేవలను కేవలం అదనపు హంగులుగా చూసిన నాన్‌టెక్ పరిశ్రమలు, ఇప్పుడు తమ వ్యాపార నమూనాల్లో కీలక మార్పులు చేస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), డేటా ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాలను తమ వ్యాపారాల్లోకి తీసుకొస్తున్నాయి. దీంతో 2026.. టెక్ నియామకాలకు ఒక కీలక మలుపుగా మారనుందని నివేదిక విశ్లేషించింది.

ఐటీ, ఐటీ అనుబంధ సేవల రంగం 2025 నుంచే స్థిరీకరణ దిశగా అడుగులు వేయడం ప్రారంభించింది. 202324 మధ్య కాలంలో నెలకొన్న అనిశ్చితి తర్వాత, ఏఐ ఇంజినీరింగ్, క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, సైబర్ సెక్యూరిటీ, డేటా ప్లాట్‌ఫామ్స్ ఆధునికీకరణ వంటి విభాగాల్లో గిరాకీ క్రమంగా పెరుగుతూ వచ్చింది. 'పరిశ్రమలు క్రమంగా పునరుద్ధరణ దిశగా సాగుతున్నాయి. క్యాంపస్ నియామకాలూ మెరుగవుతున్నాయి. కంపెనీలు తిరిగి కొత్త ఉద్యోగుల కోసం అవసరమైన కార్యక్రమాలను ప్రారంభిస్తున్నాయి' అని అడెకో ఇండియా డైరెక్టర్, బిజినెస్ హెడ్ సంకేత్ చెంగప్ప తెలిపారు.

**అవసరంగా మారిన ఏఐ, సైబర్ సెక్యూరిటీ....** ఏఐ, డేటా, సైబర్ సెక్యూరిటీ వంటి సాంకేతికతలు ప్రయోగాత్మక దశల నుంచి సంస్థల ప్రధాన అవసరాలుగా మారాయి. ఈ విభాగాల్లో గిరాకీ ఏకంగా 51% పెరిగినట్లు నివేదిక పేర్కొంది. ఇప్పటికే దాదాపు 40% పెద్ద సంస్థలు ప్రయోగాత్మక జనరేటివ్ ఏఐ ప్రాజెక్టులను కార్యరూపంలోకి తెచ్చాయి. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) సైబర్ సెక్యూరిటీకి బోర్డు స్థాయిలో ప్రాధాన్యం ఇస్తుండగా, టెక్ ఏతర రంగాలు ఆటోమేషన్‌ను వేగవంతం చేసేందుకు పెద్ద ఎత్తున టెక్ బృందాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి.

**నిపుణుల కొరత.. పెరిగిన వేతనాలు.....** ఒకవైపు ఉద్యోగావకాశాలు పెరుగుతుండగా, మరోవైపు పరిశ్రమకు అవసరమైన నిపుణుల కొరత వేధిస్తోంది. 2025 నాటికి నైపుణ్య లోటు 44 శాతానికి చేరుకుంది. దీనివల్ల నైపుణ్యాలున్న అభ్యర్థుల కోసం పోటీ పెరిగి, వేతన ప్యాకేజీలు 2024తో పోలిస్తే సగటున 18% అధికంగా లభిస్తున్నాయి. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా ఇంజినీరింగ్ వంటి విభాగాలు 45% నైపుణ్య లోటును ఎదుర్కొంటున్నాయి. రాబోయే రోజుల్లో డిజిటల్ పరివర్తన వేగం, నిపుణుల లభ్యతపైనే ఆధారపడి ఉంటుందని చెంగప్ప అభిప్రాయపడ్డారు.

**కీలకంగా.....** ప్రస్తుత టెక్ ఆధారిత నియామకాల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ), ఆరోగ్య సంరక్షణ, తయారీ, లాజిస్టిక్స్ రంగాలు ముందు వరసలో ఉన్నాయి. మొత్తం టెక్ ఉద్యోగాల్లో ఈ రంగాల వాటా దాదాపు 38 శాతంగా ఉందని అడెకో ఇండియా నివేదిక స్పష్టం చేసింది.

# ఈవీ భవిత.. రాబోయే బడ్జెట్‌లో!

**–పీఎల్ఐలో మార్పులు అవసరం**
**–పెట్టుబడి పరిమితులు తగ్గిస్తేనే అంకురాలకు ఊరట**
**–డెలాయిట్ ఇండియా నివేదిక**



దేశంలో విద్యుత్ వాహన (ఈవీ) రంగం కొన్నేళ్లుగా వృద్ధి చెందుతున్నప్పటికీ, 2030 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే ప్రస్తుత విధానాల్లో సమూల మార్పులు అవసరమని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) పథకం నిబంధనలు, జీఎస్టీ రేట్లు, ఫేమ్ సబ్సిడీ కొనసాగింపు వంటి అంశాలపై 202627 కేంద్ర బడ్జెట్‌లో స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాల్సిన అవసరం ఉందని డెలాయిట్ ఇండియా విడుదల చేసిన నివేదిక పేర్కొంది. పెట్రోలు, డీజిల్ వాహనాలతో సమానంగా ఈవీలు నిలబడాలంటే, ప్రభుత్వ చేయూత అవసరమని పరిశ్రమ పేర్కొంటోంది. రాయితీలతో పాటు మరికొన్ని విధానపరమైన నిర్ణయాలూ అవసరమని పేర్కొంటోంది.

**పెద్ద కంపెనీలకే ప్రయోజనం....** కేంద్రం వాహన రంగాన్ని ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన పీఎల్ఐ పథకం ఉద్దేశం మంచిదే. అయితే ఈ నిబంధనలు ఈవీ రంగానికి పూర్తిగా మేలు చేయడం లేదని డెలాయిట్ నివేదిక తేల్చింది. ఈ పథకం కింద అర్హత సాధించాలంటే వాహన తయారీ కంపెనీలు (ఓఈఎం) అయిదేళ్లలో కనీసం రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టాలి. ఇది పెద్ద కంపెనీలకు సాధ్యమే. కానీ, కొత్త ఆలోచనలతో వస్తున్న అంకురాలు, మధ్యతరహా పరిశ్రమలకు అంత తేలిక కాదని నివేదిక వివరించింది.

**ద్విచక్ర వాహన ప్రయోగాలన్నీ అంకురాల్లోనే....** దేశంలో ఈవీ విప్లవానికి నాంది పలికింది.. ప్రధానంగా ద్విచక్ర వాహన రంగంలోని అంకురాలే. కొత్తగా వస్తున్న స్టార్టప్‌లు బ్యాటరీ సాంకేతికతలో, మోటార్ల తయారీలో వినూత్న ప్రయోగాలు చేస్తున్నాయి. కానీ, రూ.2,000 కోట్ల పెట్టుబడి నిబంధన కారణంగా అవి పీఎల్ఐ ప్రయోజనాలకు దూరమవుతున్నాయి. అందుకే ఈ పరిమితిని తగ్గించాలని, లేకపోతే కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం పెరిగే అవకాశం ఉందని నివేదిక తెలిపింది.

**50% సమీకరణ ఎలా?....** పీఎల్ఐ పథకంలో మరో ప్రధాన అంశం.. వాహనంలో ఉపయోగించే విడిభాగాల్లో కనీసం 50% దేశీయంగా తయారై ఉండాలి. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఇది సరైనదే అయినా, క్షేత్ర పరిస్థితులు వేరేగా ఉన్నట్లు డెలాయిట్ పేర్కొంది. ఈవీలో అత్యంత కీలకమైన బ్యాటరీ సెల్స్, ఎలక్ట్రానిక్ చిప్స్ కోసం చైనా, తైవాన్, కొరియా వంటి దేశాలపై మనం ఆధారపడుతున్నాం. దేశీయంగా గిగా ఫ్యాక్టరీలు ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. విడిభాగాలూ దొరకడం లేదు. ఫలితంగా 50% నిబంధన పాటించడం కష్టంగా మారుతోంది. అందుకే చాలా కంపెనీలు పీఎల్ఐకి అనర్హులవుతున్నాయి. దేశీయంగా సరఫరా వ్యవస్థ బలపడేవరకు ఈ నిబంధనను 50% నుంచి తగ్గించాలని డెలాయిట్ సూచించింది. వాహన తయారీదార్ల సంఘం సియామ్ కూడా ఇదే విషయాన్ని సూచించింది.

**ఐటీసీ రావడం లేదు.....** ప్రస్తుతం విద్యుత్ వాహనాలపై 5% వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ఉంది. కానీ, ఈ వాహనాలకు గుండెకాయ వంటి లిథియం అయాన్ బ్యాటరీలపై 18% జీఎస్టీ ఉంది. విడిభాగాలపైనా 1828% జీఎస్టీ వర్తిస్తోంది. దీనివల్ల తయారీదారులకు 'ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)' సమస్య వస్తోందని నివేదిక తెలిపింది. ముడిసరకుపై ఎక్కువ పన్ను కట్టి, తుది ఉత్పత్తిని తక్కువ పన్నుకు అమ్మడం వల్ల కంపెనీల వద్ద పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇది వారి వర్కింగ్ క్యాపిటల్‌ను దెబ్బతీస్తోంది. పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్లలో వాహనాన్ని ఛార్జింగ్ చేసుకుంటే, దాన్ని సేవ కింద పరిగణించి 18% జీఎస్టీ విధిస్తున్నారు. ఇది వినియోగదారుడికి భారంగా మారుతోంది. బ్యాటరీలు, ఛార్జింగ్ సేవలపై జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేయాలని పరిశ్రమ కోరుతోంది.

**మరో కొత్త పథకం రావాలి....** ఫేమ్2 పథకం ముగియడం, మరో దీర్ఘకాలిక భరోసా లేకపోవడంతో వాహన కంపెనీలు కొత్త మోడళ్లను విడుదల చేసేందుకు వెనకాడుతున్నాయని నివేదిక పేర్కొంది. సబ్సిడీలు పూర్తిగా ఎత్తివేస్తే ఈవీల ధరలు 2030% పెరగొచ్చు. పెట్రోలు, డీజిల్ వాహనాలతో పోలిస్తే, ఈవీల ధరలు అధికం. కాబట్టి, మరో మూడేళ్లయినా రాయితీలు కొనసాగించేందుకు కొత్త పథకం తేవాలని పరిశ్రమ వర్గాలూ ఆశిస్తున్నాయి. పీఎం ఇడ్రైవ్ వంటి పథకాలను భారీ నిధులతో ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## స్పిరిట్ విడుదల ఖరారు



కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'స్పిరిట్'. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. వివేక్ ఒబెరాయ్, కాంచన, ప్రకాశ్‌రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాని వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ విషయాన్ని దర్శకుడు సందీప్ శుక్రవారం సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు. శక్తిమంతమైన పోలీసు కథతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ ఐపీఎస్ అధికారిగా రా రస్టిక్ లుక్‌లో అలరించనున్నారు. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# నా ఇల్లు కూల్చిన వారికి ప్రజలే బుద్ధి చెప్పారు..

మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో, ముఖ్యంగా ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (BMC)లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ఘనవిజయం సాధించడంపై నటి, ఎంపీ కంగనా రనౌత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గతంలో తన కార్యాలయాన్ని కూల్చివేసిన ఉద్ధవ్ ఠాక్రే వర్గంపై ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. తాజాగా బీఎంసీ ఫలితాలపై ఆమె ఒక వీడియో విడుదల చేశారు. "నన్ను వేధించి, నా బంగ్లాను కూల్చివేసి, నన్ను ముంబయి వదిలి వెళ్లాలని బెదిరించిన వారిని ఇప్పుడు మహారాష్ట్ర ప్రజలే సాగనంపారు" అని కంగనా వ్యాఖ్యానించారు. మహిళా వ్యతిరేక 'బంధుప్రీతి మాఫియా'కు ఓటర్లు సరైన గుణపాఠం చెప్పారని ఆమె ఎద్దేవా చేశారు.

ఈ ఎన్నికల ఫలితాలే సరైన సమాధానం..

2020లో శివసేన అధికారంలో ఉన్న సమయంలో, బాంద్రాలోని కంగనా కార్యాలయాన్ని బీఎంసీ అధికారులు అక్రమ నిర్మాణమంటూ కూల్చివేసిన విషయం తెలిసిందదే. అప్పట్లో ఈ చర్యపై బాంబే హైకోర్టు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అది దురుద్దేశపూర్వక చర్యగా పేర్కొంది. కాగా, మహారాష్ట్రలోని మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లలో 25 చోట్ల మహాయుతి కూటమి విజయం సాధించింది. బీఎంసీలో 89 స్థానాలను గెలుచుకుని బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ చారిత్రక విజయం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌లకు కంగనా అభినందనలు తెలిపారు. గతంలో జరిగిన అవమానాలకు ఈ ఎన్నికల ఫలితాలే సరైన సమాధానమని కంగనా రనౌత్ పేర్కొన్నారు.



## సడన్‌గా పెళ్లి చేసుకోబోతున్న మృణాల్!

# నిజమెంత?



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, హీరోయిన్ మృణాల్ ఠాకూర్ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారంటూ ఓ రూమర్ తెగ వైరలవుతోంది. కొంతకాలంగా ప్రేమలో ఉన్న వీరు వాలంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న వైవాహిక జీవితంలో అడుగుపెట్టబోతున్నారని సోషల్ మీడియా కోడై కూస్తోంది. ఇది చూసిన అభిమానులు ఏంటి.. నిజమేనా? అని ఆశ్చర్యపోతున్నారు.

ఇంత సడన్‌గా పెళ్లేంటి?

అయితే ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని తెలుస్తోంది. వచ్చే నెలలో మృణాల్ పెళ్లి అంటూ వస్తున్న వార్తలు ఉట్టి రూమర్సేనని హీరోయిన్ టీమ్ కొట్టిపారేసింది. ఫిబ్రవరిలో ఆమె సినిమా రిలీజ్ ఉంది, మార్చిలో మరో తెలుగు మూవీ వస్తోంది.. సినిమాలతో అంత బిజీగా ఉంటే ఇప్పుడింత సడన్‌గా పెళ్లెందుకు చేసుకుంటుందని ఆమె టీమ్ తిరిగి ప్రశ్నించింది. తనకసలు ఇప్పట్లో వివాహం చేసుకోవాలన్న ఆలోచనే లేదని, అనవసరంగా దీన్ని ఎవరో సృష్టించారని చెప్తోంది. దీంతో మృణాల్ పెళ్లి రూమర్స్‌కు ప్రస్తుతానికి ఫుల్‌స్టాప్ పడ్డట్లే కనిపిస్తోంది.

సినిమా

సినిమాల విషయానికి వస్తే.. ధనుష్ చివరగా తేరే ఇష్క్ మే మూవీతో పలకరించాడు. బాక్సాఫీస్ వద్ద రూ.160 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సూపర్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం కార మూవీ చేస్తున్నాడు. మృణాల్ ఠాకూర్ చివరగా సన్ ఆఫ్ సర్దార్ మూవీతో పలకరించింది. ప్రస్తుతం హిందీలో మూడు సినిమాలు చేస్తోంది. తెలుగులో హీరోయిన్‌గా నటించిన డెకాయిట్ మార్చిలో విడుదల కానుంది. అల్లు అర్జున్- అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాలోనూ కథానాయికగా యాక్ట్ చేస్తోంది.



## బాలీవుడ్‌లో తగ్గిన అవకాశాలు.. మతం చూసి వెనకడుగు!



సంగీత ప్రపంచంలోనే అగ్రజుడు ఏఆర్ రెహమాన్. కోలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్.. ఇలా అన్ని భాషల్లోనూ తన సత్తా చూపించాడు. పుట్టుకతోనే హిందూ అయిన ఇతడు తర్వాత ముస్లిం మతానికి మారిపోయాడు. అయితే తాను ముస్లిం అవడం వల్ల బాలీవుడ్‌లో సరైన అవకాశాలు రాలేదంటూ అతడు చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

ఔట్ సైడర్

తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ.. రోజా, బాంబే, దిల్‌సే వంటి హిట్ సినిమాలకు సంగీతం అందించినప్పటికీ నేను బాలీవుడ్‌లో ఔట్‌సైడర్ (ఇండస్ట్రీలో ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేని వ్యక్తి)లానే ఫీల్ అయ్యేవాడిని. కానీ తాల్ సినిమా పాటలు అందరి ఇంట్లోకి చేరాయి. ఇప్పటికీ ఎంతోమంది ఉత్తరాదివాళ్లు ఆ మూవీ పాటలు వింటూనే ఉంటారు. ఎందుకంటే అందులో కొంత పంజాబీ, కొంత హిందీ మ్యూజిక్ మిక్స్ అయి ఉంటుంది.

8 ఏళ్లుగా తగ్గిన అవకాశాలు

అప్పుడు నాకు పంజాబీ సంగీతంపై మరింత ఆసక్తి కలిగింది. అలా సుక్వీందర్ సింగ్‌ను కలిశాను. తనతో కలిసి చేసిన 'చయ్య చయ్య', 'జై హో..' పాటలు ఎంత ఆదరణ పొందాయో మీ అందరికీ తెలిసిందే. అయితే ఎనిమిదేళ్లుగా నాకు బాలీవుడ్‌లో అవకాశాలు తగ్గాయి. బహుశా దీనికి ఇండస్ట్రీలో మారిన పవర్ షిఫ్ట్ ఒక కారణమైతే.. నా మతం కూడా మరో కారణం కావొచ్చు. ఏదేమైనా నాకు నా కుటుంబానితో గడిపేందుకు సమయం దొరికిందనుకుంటాను.

అవే నా దగ్గరకు..

అయినా పనికోసం నేను పాకులాడటం లేదు. పనే నా దగ్గరకు రావాలని అనుకుంటాను. నా వృత్తిపట్ల నాకున్న నిబద్ధతే నాకు అవకాశాలు తెచ్చిపెడుతుందని భావిస్తున్నాను అని చెప్పుకొచ్చాడు. రెహమాన్ చేసిన ఈ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగుతోంది. మతమే అడ్డంకైతే ఇండస్ట్రీలో ఇన్ని అవకాశాలు వచ్చేవే కాదని పలువురు సోషల్ మీడియా వేదికగా దుమ్మెత్తిపోస్తున్నారు. రామాయణం మూవీలో ఛాన్స్ నీ మతం చూసే ఇచ్చారా? అని మండిపడుతున్నారు.

# తస్కరీ.. ఇమ్రాన్ హష్మీ వెబ్‌సిరీస్ థ్రిల్ పంచిందా

**సంక్రాంతి సందర్భంగా బాక్సాఫీసు ముందుకొచ్చిన సినిమాలు ప్రేక్షకులకు వినోదం పంచుతున్నాయి. పండగ సందర్భంగా మరోవైపు ఓటీటీల్లోకి కొత్త కంటెంట్ వచ్చింది. వాటిలో ఒకటి 'తస్కరీ: ది స్మగ్లర్స్ వెబ్ ఇమ్రాన్ హష్మీ నటించిన వెబ్‌సిరీస్ ఇది. 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ ఎలా ఉందంటే?**

ప్రకాశ్ కుమార్ (అనురాగ్ సిన్హా) నిజాయతీ గల కస్టమ్స్ ఆఫీసర్. పై అధికారులు ఆయనకు.. ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగిస్తారు. దీంతో, స్మగ్లింగ్ అనే మాట వినపడకుండా చేయాలనుకుంటాడు. దాని కోసం ఏరికోరి.. అప్పటికే సస్పెండ్ అయిన అర్జున్‌మీనా (ఇమ్రాన్ హష్మీ), రవీందర్ గుజ్జర్ (నందీశ్ సంధు), మిథాలీ కామత్ (అమృత ఖాన్‌విల్కర్) తదితరులతో ఓ టీమ్ ఏర్పాటు చేస్తాడు. ఆ బృందానికి నాయకుడిగా అర్జున్‌ను నియమిస్తాడు. తమకు అసలైన సవాలుగా ఉన్న బడా చౌదరి (శరద్ ఖేల్కర్) సిండికేట్ గురించి వివరించి, టీమ్‌ను వెంటనే రంగంలోకి దించుతాడు. మరి, భారత్‌లో దందా చేస్తూ విదేశాల్లో నేర సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న బడా చౌదరి అహంకారాన్ని అర్జున్ అణచగలిగాడా? ఈ క్రమంలో తనకు టీమ్ సపోర్ట్ దక్కిందా? తన పై అధికారుల నమ్మకాన్ని ప్రకాశ్ నిలబెట్టుకున్నాడా? అన్నది ఈ సిరీస్ కథ

కస్టమ్స్ అధికారుల కళ్లుగప్పి కొందరు స్మగ్లర్లు బంగారాన్ని అక్రమంగా ఎలా తీసుకొస్తారన్నది ఇప్పటికే కొన్ని సినిమాల్లో చూశాం. ఆయా చిత్రాల్లో కొంతమేరకే అది పరిమితం. పూర్తిగా స్మగ్లింగ్ సీన్స్‌తో రూపొందిందే 'తస్కరీ'. దానర్థం తస్కరించడం. అయితే, కస్టమ్స్ డిపార్ట్‌మెంట్, కస్టమ్స్ ఓవర్సీస్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ (సీవోఐఎన్) గురించి ప్రేక్షకుడిలో కాస్త అవగాహన కలిగేలా ఈ సిరీస్‌ని తీర్చిదిద్దడం విశేషం (Taskaree Review).

అర్జున్‌మీనా పాత్ర వాయిస్ ఓవర్‌తో కథను వివరించిన తీరు బాగుంది. విదేశాల నుంచి తీసుకొచ్చే వస్తువులకు చాలామంది డ్యూటీ చెల్లించకపోవడం వల్ల దేశానికి ఎంత నష్టం జరుగుతోంది? అసలు ముంబయి విమానాశ్రయం ద్వారా ఎంత బంగారం అక్రమంగా వస్తోంది? కస్టమ్స్ అధికారులు దానికెందుకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు?.. ఇలాంటి అంశాల ప్రస్తావనతో 'తస్కరీ' ప్రపంచం ప్రేక్షకుడికి పరిచయం అవుతుంది. కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా ప్రకాశ్ ఛార్జ్ తీసుకోవడం నుంచి అసలు స్టోరీ మొదలవుతుంది. అర్జున్‌మీనాలాంటి వారు మళ్లీ తిరిగి జాబ్‌లో జాయిన్ అయ్యే సన్నివేశాల ఎలివేషన్, ఆయా పాత్రలకు ప్రకాశ్ ఇచ్చిన బిల్డప్ బాగుంది. కానీ, అసలు వారెందుకు సస్పెండ్ అయ్యారన్నది రివీల్ చేయకపోవడం ఆడియన్స్‌కు అసంతృప్తే . బడా చౌదరిని పట్టుకునే క్రమంలో అర్జున్‌కు సాయం చేసే ఎయిర్ హోస్టెస్ ప్రియ లాంటి పాత్రలను అవసరానికి మించి చూపించడంతో అక్కడక్కడా సాగదీత తప్పలేదు. 'ఆపరేషన్ లాంగ్‌షాట్'తో సిరీస్ మళ్లీ సరైన ట్రాక్ ఎక్కుతుంది. చిన్న చిన్న మొత్తంలో కాకుండా ఒకేసారి కుంభస్థలాన్ని బద్దలు కొట్టాలన్న ఉద్దేశంతో కస్టమ్స్ ఆఫీసర్స్.. బడా చౌదరి నెట్‌వర్క్‌ను క్లోజ్ చేయాలనుకోవడం, అందుకు వారు చేసే ప్రయత్నాలు థ్రిల్ పంచుతాయి. ఓ వైపు ఈ థ్రిల్లింగ్ ఆపరేషన్‌ను చూపిస్తూనే.. మరోవైపు సెంటిమెంట్‌ను మిళితం చేశారు. నిజాయతీతో ఉండే ప్రభుత్వ అధికారులు.. కొందరి నుంచి ఎదుర్కొనే ఇబ్బందులు, అవమానాలు ఎలాంటివో చూపించారు. ముగింపునకు చేరుకుందనుకులోగా కథ ఊహించని మలుపు తిరుగుతుంది. తొలి నుంచి ఫాలో అయితేనే తప్ప ఆ ట్విస్టును ఎంజాయ్ చేయలేం. సీజన్ 2కి లీడ్ ఇస్తూ సిరీస్‌ను ఎండ్ చేశారు.

తనపై ఉన్న 'సీరియల్ కిస్సర్' ముద్ర చెరిపేయాలన్న ఉద్దేశంతో ఇమ్రాన్ తన పంథాను పూర్తిగా మార్చేశారు. నటనకు ప్రాధాన్యం ఉన్న కథలు/పాత్రలనే ఎంపిక చేసుకుంటున్నారు. అలా ఎంపిక చేసుకున్న అర్జున్‌మీనా రోల్‌కు పూర్తిగా న్యాయం చేశారు. కస్టమ్స్ సూపరింటెండెంట్‌గా సెటిల్డ్‌గా నటించారు. నటనకు స్కోప్ ఉన్న మరో పాత్ర అనురాగ్ సిన్హాది. కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా అదరగొట్టారు. ఇతరులు పరిధి మేరకు నటించారు. టెక్నికల్ విభాగంలో నేపథ్య సంగీతానిదే పైచేయి. క్రియేటర్ నీరజ్ పాండే 'తస్కరీ'తో కొత్త ప్రపంచాన్ని చూపించే ప్రయత్నం చేశారు. రాఘవ్ ఎం.జైరత్, బి.ఎ.ఫిదాతో కలిసి ఆయనే డైరెక్ట్ చేయడం విశేషం (Taskaree Cast and Crew).



కుటుంబంతో కలిసి చూడొచ్చా?: ఇందులోని సన్నివేశాలు, సంభాషణల్లో ఎలాంటి అసభ్యతకు తావులేదు. ఫ్యామిలీతో కలిసి నిరభ్యంతరంగా చూడొచ్చు.

ఎన్ని ఎపిసోడ్లు?: ఏడు ఎపిసోడ్లతో రూపొందిన ఈ సిరీస్ తెలుగు ఆడియోతోనూ స్ట్రీమింగ్ అవుతోంది. కొన్ని ఎపిసోడ్లు దాదాపు 40 నిమిషాల నిడివితో రూపొందగా.. మరికొన్ని సుమారు 50 నిమిషాల రన్‌టైమ్‌తో తెరకెక్కాయి (Taskaree Runtime).

ప్లస్ పాయింట్స్

+ కాన్సెప్ట్

**+ కొన్ని ట్విస్టులు**

**+ అర్జున్‌మీనా, ప్రకాశ్ పాత్రలు**

**మైనస్ పాయింట్స్**

**- అవసరానికి మించి పాత్రల ప్రస్తావన**

**ఫైనల్‌గా: 'తస్కరీ' థ్రిల్.. ఆసాంతం చూస్తేనే (Taskaree Review)!**

**గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!**

ఆశ్రిత:



# మళ్లీ యూపీనే..

నవీ ముంబయి: డబ్ల్యూపీఎల్ 4లో వరుసగా మూడు ఓటముల తర్వాత.. గత మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై నెగ్గి గాడిలో పడిన యూపీ వారియర్స్.. జోరు కొనసాగిస్తోంది. స్ఫూర్తిదాయక ప్రదర్శన చేసిన ఆ జట్టు మళ్లీ ముంబయిని కంగుతినిపించి వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. శనివారం యూపీ 22 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. మొదట ఆ జట్టు 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', కెప్టెన్ మెగ్ లానింగ్ (70; 45 బంతుల్లో 11×4, 2×6), ఫోబి లిచ్‌ఫీల్డ్ (61; 37 బంతుల్లో 7×4, 3×6) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. అమేలియా కెర్ (3/28), నాట్ సీవర్ (2/22) రాణించారు. ఛేదనలో ముంబయి 6 వికెట్లకు 165 పరుగులకే పరిమితమైంది. అమేలియా కెర్ (49 నాటౌట్; 28 బంతుల్లో 6×4, 1×6), అమన్‌జ్యోత్ కౌర్ (41; 24 బంతుల్లో 4×4, 3×6) పోరాడినా జట్టుకు విజయాన్ని అందించలేకపోయారు. యూపీ బౌలర్లలో శిఖ పాండే రెండు వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్, ఎకిల్‌స్టోన్, దీప్తి, ట్రయాన్ తలా వికెట్ పడగొట్టారు. ముంబయికి వరుసగా ఇది రెండో ఓటమి.

ముంబయి తడబాటు: 69/5.. భారీ ఛేదనలో ముంబయి ఇన్నింగ్స్ సాగిన తీరిది. యూపీ బౌలర్ల ధాటికి ఆరంభం నుంచే ఇబ్బంది పడిన ఆ జట్టు.. క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుంది. 23/0తో కాస్త మెరుగ్గానే మొదలుపెట్టిన ముంబయి.. తర్వాత తడబడింది. ఓపెనర్లు సజన (10), హేలీ మాథ్యూస్ (13) వికెట్లు కోల్పోయింది. నాట్ సీవర్ (15), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (18), నికోలా కేరీ (6) సైతం పెవిలియన్ చేరిపోవడంతో ఓటమి దిశగా సాగింది. ఈ స్థితిలో అమేలియా కెర్, అమన్‌జ్యోత్ నిలిచారు. ఎదురుదాడికి దిగిన ఈ జంట.. ముంబయి శిబిరంలో ఆశలు రేపింది. కానీ మిడిల్ ఓవర్లలో యూపీ బౌలర్లు శిఖ, ఎకిల్‌స్టోన్, దీప్తి కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడం.. సమీకరణం (24 బంతుల్లో 63) క్లిష్టంగా మారడంతో ముంబయిపై ఒత్తిడి పెరిగిపోయింది. దీనికి తోడు అమన్‌జ్యోత్ ఔట్ కావడంతో ఆ జట్టుకు అవకాశాలు లేకుండాపోయాయి. అంతకుముందు యూపీ ఇన్నింగ్స్‌లో మెగ్ లానింగ్, లిచ్‌ఫీల్డ్ ఆటే హైలైట్. తొలి ఓవర్లోనే కిరణ్ నవ్‌గిరె (0) వికెట్ పడినా.. దూకుడుగా ఆడిన లానింగ్, లిచ్‌ఫీల్డ్ యూపీ స్కోరుబోర్డు పరుగులెత్తించారు. చక్కని షాట్లతో స్కోరు పెంచారు. లానింగ్ 35 బంతుల్లో.. లిచ్‌ఫీల్డ్ 33 బంతుల్లో అర్ధసెంచరీలు అందుకున్నారు. 12.6 ఓవర్లకు 124/1తో యూపీ.. 200పైన స్కోరు చేసేలా కనిపించింది. కానీ లిచ్‌ఫీల్డ్, లానింగ్ స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో ఆ జట్టు దూకుడుకు బ్రేక్ పడింది. హర్లీన్ డియోల్ (25), ట్రయాన్ (21) రాణించడంతో యూపీ 180పైన స్కోరు సాధించగలిగింది.

**యూపీ వారియర్స్: 187/8 (మెగ్ లానింగ్ 70, ఫోబి లిచ్‌ఫీల్డ్ 61, హర్లీన్ 25, ట్రయాన్ 21; అమేలియా కెర్ 3/28, నాట్ సీవర్ 2/22); ముంబయి ఇండియన్స్: 165/6 (అమేలియా కెర్ 49 నాటౌట్, అమన్‌జ్యోత్ కౌర్ 41; శిఖ పాండే 2/30, క్రాంతి గౌడ్ 1/32, ఎకిల్‌స్టోన్ 1/33, దీప్తి 1/35, ట్రయాన్ 1/18)**

# అండర్-19 ప్రపంచకప్.. విజృంభించిన విహాన్



బులవాయో: అండర్19 ప్రపంచకప్‌లో భారత యువ జట్టు సత్తా చాటింది. వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఆఫ్‌స్పిన్నర్ విహాన్ మల్హోత్రా (4/14) మాయ చేసిన వేళ.. శనివారం వర్ష ప్రభావిత మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 18 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను తొలుత 49 ఓవర్లకు కుదించారు. భారత్ 48.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. అభిజ్ఞాన్ కుందు (80; 112 బంతుల్లో 4×4, 3×6), వైభవ్ సూర్యవంశీ (72; 67 బంతుల్లో 6×4, 3×6) కీలక ఇన్నింగ్స్ ఆడారు. వర్షం వల్ల లక్ష్యాన్ని 29 ఓవర్లలో 165 పరుగులకు సవరించగా.. బంగ్లాదేశ్ 28.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. అజిజుల్ హకీమ్ (51) టాప్ స్కోరర్. బంగ్లా ఓ దశలో విజయంవైపు సాగినా.. 22 పరుగుల వ్యవధిలో ఏడు వికెట్లు పడగొట్టి భారత్ విజయాన్ని లాగేసుకుంది. టాస్ సమయంలో రెండు జట్ల కెప్టెన్లు కరచాలనం చేసుకోలేదు. కానీ మ్యాచ్ అనంతరం ఆటగాళ్లు స్నేహపూర్వకంగా వ్యవహరించారు. కరచాలనాలు చేసుకున్నారు.

అతడు తిప్పేశాడు..: బంగ్లా ఛేదనలో తొలి ఓవర్లోనే ఓపెనర్ అబ్రార్ (5)ను దీపేశ్ ఔట్ చేశాడు. కానీ చక్కగా బ్యాటింగ్ చేసిన అజిజుల్ హకీమ్, రిఫాత్ బేగ్ రెండో వికెట్‌కు 56 పరుగులు జోడించారు. జట్టు స్కోరు 62 వద్ద రిఫాత్ (37) ఔటయ్యాడు. వర్షం అంతరాయం కలిగించే సమయానికి బంగ్లా 17.2 ఓవర్లలో 90/2తో నిలిచింది. ఆ తర్వాత బంగ్లా 20 ఓవర్లలో 102/2తో బలమైన స్థితిలో నిలిచింది. లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. కానీ అద్భుతమైన బౌలింగ్‌తో విహాన్ మల్హోత్రా మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. తన ఆఫ్‌స్పిన్‌తో బంగ్లా వెన్నువిరిచాడు. మంచి టర్న్, బౌన్స్‌తో అతడు మిడిల్ ఆర్డర్ పని పట్టాడు. వరుసగా తన మూడు ఓవర్లలో సిద్దికి (15), జిబాన్ (7), బాసిర్ (2)ను ఔట్ చేసిన విహాన్.. 11 పరుగులే ఇచ్చాడు. ఈ మధ్యలో హకీమ్‌ను ఖిలాన్ పెవిలియన్ చేర్చాడు. 26 ఓవర్లలో 131/6తో నిలిచింది బంగ్లాదేశ్.. తర్వాతి ఓవర్లో ఖిలాన్ ఓ వికెట్ పడగొట్టినప్పటికీ 12 పరుగులిచ్చాడు. అయితే విహాన్ వేసిన 28వ ఓవర్లో బంగ్లా 3 పరుగులే చేసి 2 వికెట్లు కోల్పోయింది. దీంతో భారత్ విజయం ఖాయమైపోయింది.

వైభవ్

రాణించిన ఆ ఇద్దరు: అల్ ఫహాద్ (5/38) విజృంభించడంతో అంతకుముందు భారత్‌ను బంగ్లా కట్టడి చేసింది. ఓ దశలో భారత్ 53కే మూడు వికెట్లు కోల్పోగా.. వైభవ్, అభిజ్ఞాన్ కుందు పోరాడారు. వైభవ్ ఎప్పటిలా కాకుండా కాస్త నియంత్రణ పాటించాడు. నాలుగో వికెట్‌కు 62 పరుగులు జోడించి ఔటయ్యాడు. వెంటనే హర్వంశ్ (2) కూడా వెనుదిరిగినప్పటికీ కనిష్క్ (28)తో కలిసి కుందు ఆరో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. కనిష్క్ తర్వాత అంబ్రిశ్ (5), ఖిలాన్ (8) కూడా ఔటైనప్పటికీ చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన కుందు.. జట్టు గౌరవప్రద స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. చివరికి 47వ ఓవర్లో జట్టు స్కోరు 224 వద్ద 9వ వికెట్‌గా అతడు వెనుదిరిగాడు.

సంక్షిప్త స్కోర్లు...

# బెంగళూరు 'హ్యాట్రిక్'



రోజు మాత్రమే మారింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దూకుడు మారలేదు. 24 గంటల్లోనే ఆ జట్టు డబ్ల్యూపీఎల్ 4లో మరో విజయాన్ని నమోదు చేసింది. శనివారం ఆర్సీబీ 8 వికెట్ల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. మొదట లారెన్ బెల్ (3/26), సయాలి సత్ఘారే (3/27), ప్రేమ రావత్ (2/16) ధాటికి దిల్లీ 20 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. షెఫాలి వర్మ (62; 41 బంతుల్లో 5×4, 4×6) టాప్ స్కోరర్. లూసీ హామిల్టన్ (36), స్నేహ్ రాణా (22) రాణించారు. స్మృతి మంధాన (96; 61 బంతుల్లో 13×4, 3×6) మెరుపులతో బెంగళూరు 18.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. జార్జియా వోల్ (54 నాటౌట్; 42 బంతుల్లో 5×4, 2×6) కీలక ఇన్నింగ్స్ ఆడింది. శుక్రవారం ఆర్సీబీ గుజరాత్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. ఈ సీజన్లో వరుసగా నాలుగో విజయంతో ఆ జట్టు ప్లేఆఫ్స్ దిశగా మరో అడుగు వేసింది.

సత్తా చాటిన స్మృతి: 167 పరుగుల ఛేదనలో బెంగళూరు ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగింది. 5 ఓవర్లకు ఆ జట్టు స్కోరు 27 పరుగులే.. పైగా ఒక వికెట్ పడింది. ఈ స్థితిలో స్మృతి బ్యాట్ ఝుళిపించింది. నందని బౌలింగ్‌లో సిక్స్‌తో మొదలైన ఆమె జోరు.. ఆ తర్వాత మరింత పెరిగింది. జార్జియా వోల్ నుంచి ఆమెకు చక్కటి సహకారం అందింది. దీంతో 10 ఓవర్లకు 83/1తో ఆర్సీబీ లక్ష్యం దిశగా సాగింది. ముఖ్యంగా చక్కని బ్యాటింగ్ కొనసాగించిన స్మృతి ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఈ క్రమంలోనే ఈ స్టార్ బ్యాటర్ 31 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకుంది. మరోవైపు జార్జియా కూడా దూకుడుగా ఆడడంతో లక్ష్యం వేగంగా కరిగిపోయింది. సెంచరీ చేసేలా కనిపించిన స్మృతి.. ఈ మైలురాయికి నాలుగు పరుగుల దూరంలో ఔటైంది. నందని బౌలింగ్‌లో లూసీ పట్టిన ఓ మెరుపు క్యాచ్‌కు స్మృతి వెనుదిరిగింది. రిచా (7 నాటౌట్)తో కలిసి జార్జియా పని పూర్తి చేసింది. అంతకుముందు దిల్లీ తడబడినా.. మెరుగైన స్కోరుతో ఇన్నింగ్స్‌ను ముగించింది. ఆ జట్టు 10 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. లిజెలీ (4), లారా వోల్వార్ట్ (0), జెమీమా (4), మారిజేన్ కాప్ (0) పెవిలియన్ చేరిపోయారు. ఈ స్థితిలో షెఫాలి వర్మ మెరుపు అర్ధసెంచరీతో ఆ జట్టును ఆదుకుంది. లూసీ హామిల్టన్, స్నేహ్‌రాణా రాణించడంతో దిల్లీ పోరాడే స్కోరు చేయగలిగింది.

**దిల్లీ: 166 ఆలౌట్ (షెఫాలి వర్మ 62, లూసీ హామిల్టన్ 36, స్నేహ్ రాణా 22; లారెన్ బెల్ 3/26, సయాలి 3/27, ప్రేమ 2/16) బెంగళూరు: 18.2 ఓవర్లలో 169/2 (స్మృతి మంధాన 96, జార్జియా వోల్ 54 నాటౌట్, మరిజేన్ కాప్ 1/21, నందని 1/34)**

# సిరీస్ పట్టేదెవరు?



గెలుపే లక్ష్యంగా భారత్

తొలి సిరీస్ కోసం కివీస్

ఇండోర్: స్వదేశంలో న్యూజిలాండ్‌పై భారత క్రికెట్ జట్టు తిరుగులేని ఆధిపత్యం చూపుతోంది. ఎంతలా అంటే.. గతంలో భారత గడ్డపై కివీస్ ఏడుసార్లు పర్యటించినా ఒక్కసారి కూడా ఆ జట్టు ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను నెగ్గలేదు. ప్రస్తుతం మూడు వన్డేల సిరీస్ 1-1తో సమమైన వేళ ఆదివారం ఇండోర్‌లో ఇరుజట్ల మధ్య నిర్ణాయక పోరు జరుగనుంది. ఈనేపథ్యంలో పర్యాటక జట్టుపై ఎప్పటిలాగే టీమిండియా తమ జోరును చూపుతుందా? లేక దశాబ్దాలుగా ఊరిస్తోన్న వన్డే సిరీస్‌ను కివీస్ తొలిసారి దక్కించుకుంటుందా? అనేది ఆసక్తిగా మారింది. ఇక.. 2019 నుంచి స్వదేశంలో భారత్.. ఏ జట్టుపైనా వన్డే సిరీస్‌ను కోల్పోలేదు.

అర్ష్‌దీప్‌నకు చాన్స్!

ఆఖరి మ్యాచ్‌లో గిల్ సేన కూర్పుపై అందరి దృష్టి పడనుంది. కొత్త బంతితో చక్కగా స్వింగ్ చేయగల లెఫ్టామ్ పేసర్ అర్ష్‌దీప్‌ను ఆడించే అవకాశం ఉంది. కివీస్ టాప్, మిడిలార్డర్‌లో ఎక్కువ కుడిచేతి బ్యాటర్లు ఉండడంతో వారిపై తను ఒత్తిడి పెంచవచ్చు. అలాగే మధ్య ఓవర్లలో స్పిన్నర్లపై భారం తగ్గుతుంది. అలాగే నితీశ్‌ను రెండో వన్డేలో ఆడించినా అతడితో పెద్దగా బౌలింగ్ చేయించలేదు. అతడి స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్ ఆయుష్ బదోనితో ముందుకెళితే ఎలా ఉంటుందనే ఆలోచనలో కోచ్ గంభీర్ ఉన్నాడు. బ్యాటింగ్‌లో కెప్టెన్ గిల్ ఫామ్‌లోకి రాగా రోహిత్ నుంచి భారీ స్కోరు రావాల్సి ఉంది. మరో ఆరు నెలల వరకు వన్డేలు లేకపోవడంతో అభిమానులు ఈ మ్యాచ్‌లో రో-కో షో చూడాలని భావిస్తున్నారు.

గిల్ వెంట ప్యూరిఫయర్

ఇండోర్‌లో కలుషిత తాగునీటి వల్ల ఇటీవల పలువురు మృత్యువాత పడడంతో భారత క్రికెట్ జట్టు తమ ఆటగాళ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటోంది. దీంట్లో భాగంగా వీరు బస చేసే స్టార్ హోటల్‌తో పాటు స్టేడియంలోనూ పరిశుభ్రమైన నీటిని అందించే ఏర్పాట్లు చేశారు. మరోవైపు కెప్టెన్ గిల్ మాత్రం ఎందుకైనా మంచిదని.. తన హోటల్ గదిలో ఏకంగా రూ.3 లక్షల ఖరీదు చేసే వాటర్ ప్యూరిఫయర్‌ను బిగించుకున్నట్టు సమాచారం. దీనికి ప్యాకేజ్డ్ నీటిని కూడా తిరిగి శుద్ధి చేసే సామర్థ్యం ఉండనుంది.

# ఐపీఎల్ 2026.. చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లకు గ్రీన్ సిగ్నల్

ఆర్సీబీ అభిమానులకు గుడ్‌న్యూస్. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం (Chinnaswamy Stadium)లో ఐపీఎల్, అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించేందుకు అనుమతి లభించినట్లు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (KSCA) శనివారం ప్రకటించింది. "అంతర్జాతీయ, ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించడానికి కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌కు హోం శాఖ, కర్ణాటక ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ప్రకటించడానికి మేం సంతోషిస్తున్నాం" అని కేఎస్‌సీఏ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు సూచించిన నిర్దిష్ట నిబంధనలు, షరతులకు అనుగుణంగా మ్యాచ్‌ల నిర్వహణ ఉంటుందని తెలిపింది. ఐపీఎల్ 2025లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవగా.. జూన్ 4న చిన్నస్వామి స్టేడియంలో సంబరాలు నిర్వహించారు. అప్పుడు స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైకెల్ డి.కున్హా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ వేసింది. ఈ కమిషన్ చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌ల నిర్వహణకు సురక్షితం కాదని తేల్చింది. ఈ క్రమంలో కొన్ని షరతులతో మ్యాచ్‌లు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 26 నుంచి మొదలుకానుంది.





# రేపే సిరీస్ డిసైడర్ మ్యాచ్..

## ఉజ్జయిని మహాకాళేశ్వరుడి సేవలో విరాట్ కోహ్లీ

మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్ (India), న్యూజిలాండ్ (New Zealand) జట్లు చేరో మ్యాచ్‌లో విజయం సాధించి 1-1తో సమంగా నిలిచాయి. ఇక నిర్ణయాత్మకమైన మూడో వన్డే మ్యాచ్ మధ్యప్రదేశ్‌లో ఇండోర్ (Indore) వేదికగా జరగనుంది. ఈ క్రమంలోనే మ్యాచ్‌కు ముందు టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (Virat Kohli), స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (Kuldeep Yadav) ఇవాళ ఉదయం ఉజ్జయినిలో ఉన్న ప్రసిద్ధ శ్రీ మహాకాళేశ్వర ఆలయాన్ని సందర్శించారు. తెల్లవారుజామున 4 గంటలకు జరిగిన పవిత్ర 'భస్మ హారతి'లో వారిద్దరూ పాల్గొన్నారు. దాదాపు 2 గంటల పాటు ఆలయంలో గడిపిన విరాట్, కుల్దీప్ నంది హాల్‌లో కూర్చుని స్వామివారిని దర్శించుకున్నారు. అయితే, వారి కంటే ఒకరోజు ముందే టీమ్ ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ కూడా మహాకాళేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే.